# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 317, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం - 29 - జనవరి - 2025


## నేడే మౌనీ అమావాస్య..

### ఒక్క రోజే కుంభమేళాలో 10 కోట్ల మంది పుణ్య స్నానాలు



**కుంభమేళాకు ఒక్క రోజే సుమారు పది కోట్ల మందికిపైగా వచ్చే అవకాశాలు**

**మౌనీ అమావాస్య ప్రత్యేకతేంటి..**

**యూపీ సర్కారు భారీగా ఏర్పాట్లు**

**ప్రయాగ్‌రాజ్:** త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తున్నారు. ఇప్పటికే 15 కోట్ల మంది మహాకుంభ్‌లో

## ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సంచలన లేఖ



**న్యూఢిల్లీ,:** బీజేపీపై ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరోసారి విరుచుకుపడ్డారు. బిలియనీర్లు తీసుకున్న రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేస్తోందని.. మరోవైపు సాధారణ ప్రజలపై అధిక పన్ను భారాన్ని మోపుతోందని తీవ్ర విమర్శలు చేశారు. ధనికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయకుండా ఒక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు కేజ్రీవాల్. "కేంద్ర ప్రభుత్వం బిలియనీర్లకు అనుకూలంగా పేదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది.

## రెండు విడుతలుగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..



### 31న ప్రసంగించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ,:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్న

## టీడీపీలో వీరికే నామినేటెడ్ పదవులు

### చంద్రబాబు కండిషన్..!



- 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని చంద్రబాబు నేతలకు సూచన
- ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తాం
- జూన్‌లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు పూర్తి చేస్తాం

వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలి

**అమరావతి,:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు విడతలుగా నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేసింది. ఇప్పుడు మూడో విడత పోస్టుల భర్తీ కోసం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు తన సొంత పార్టీ టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఆయన ఈసారి నామినేటెడ్ పోస్టులు ఎవరికో తేల్చిచెప్పేసారు. వారి పేర్లనే తనకు సూచించాలని కూడా నేతలకు క్లారిటీ ఇచ్చేశారు. టీడీపీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పార్టీఇంఛార్జ్‌లతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు,

## సులభతర వాణిజ్యంలో ఏపీని మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయండి



**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమీక్ష**

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంశంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్న సీఎస్**

**దీంతో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్న సీఎస్**

**అమరావతి,:** సులభతర వాణిజ్యం విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గత పదేళ్లలో ఎక్కువ పర్యాయాలు

## అప్పులు పుట్టడం లేదని సాకులు చెప్పొద్దు..

### చంద్రబాబుపై షర్మిల ఫైర్



- పథకాల అమలుపై దృష్టి పెట్టాలని ఏపీ కాంగ్రెస్ తరఫున షర్మిల డిమాండ్
- నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారు
- మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు

**అమరావతి,:** కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు

## రేవంత్ రెడ్డిపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు



**ఫార్ములా ఈ-రేస్ కేసులో రేవంత్ రెడ్డివి అనాలోచిత చర్యలు అన్న ఆర్ఎస్పీ**

**సీఎం తీరు వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆగ్రహం**

**సీఎంపై కేసు నమోదు చేసి విచారణ జరపాల్సిన అవసరం ఉందని డిమాండ్**

**హైదరాబాద్, :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని

## పెట్టుబడులపై కొంతమంది దుష్ప్రచారం చేశారు

### దావోస్ పర్యటనపై సీఎం రేవంత్ రెడ్డి

- దావోస్ పర్యటన ద్వారా భారీ ఒప్పందాలు కుదిరాయన్న సీఎం
- ప్రభుత్వంపై నమ్మకం ఉంచి భారీ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయన్న సీఎం
- దావోస్ ద్వారా రూ.1.80 లక్షల పెట్టుబడులు వచ్చాయన్న రేవంత్ రెడ్డి
- ప్రపంచస్థాయి ఎక్స్‌పీరియం పార్క్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్.. పాల్గొన్న చిరంజీవి
- రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్క్
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏకంగా 150 ఎకరాల్లో ఈ పార్క్ ఏర్పాటు
- ఇందులో 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న 25వేల జాతుల మొక్కలు, చెట్లు, వృక్షాలు




**హైదరాబాద్, :** హైదరాబాద్‌లో పెట్టుబడులు, వ్యాపారాలపై కొంతమంది దుష్ప్రచారం చేశారని, కానీ దావోస్ పర్యటన ద్వారా భారీ ఒప్పందాలు రావడంతో వారి ప్రచారం పటాపంచలైందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ఈ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకు వచ్చేందుకు దావోస్ వెళ్లామన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. దావోస్ ద్వారా

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని అడుగుతున్నా : కేటీఆర్



**రైతులు తిరగబడుతందుకు నల్లగొండనే వేదిక కావాలె. నీకు సిగ్గుందా అని అడుగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం**

**హైదరాబాద్, :** నల్లగొండలో రైతు ధర్నా ను అడ్డుకునేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్ని ప్రయత్నాలు చేశాడని, ఆఖరికి దివ్యాంగుడు అయిన బీఆర్ఎస్ నాయకుడు భూపాల్‌రెడ్డి పై పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసింద్రని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని తాను అడుగుతున్నానని ఆయన మండిపడ్డారు. నల్లగొండ గడ్డ నాడు సాయుధ రైతాంగ పోరాటానికి రాష్ట్ర రైతుల్లో స్ఫూర్తి నింపిందని, ఇప్పుడు కూడా రైతులు తిరగబడేందుకు నల్లగొండనే వేదిక కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ ఆనాడు మొత్తం రాష్ట్ర రైతాంగానికి సాయుధపోరాటంలో ఎట్లైతే స్ఫూర్తిని

## ఆంధ్రప్రదేశ్ లో జిల్లాకో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్



- ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడి
- రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వివరణ
- చిన్నపిల్లలు, వృద్ధులపై లైంగిక దాడులు సిగ్గుపడాల్సిన విషయమన్న డీజీపీ

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ లో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని డీజీపీ ద్వారకా తిరుమలరావు

## ఏపీపై మోదీ స్పెషల్ ఫోకస్

### సంతుష్టీకరణ-తాయిలాలు సిద్ధం




**న్యూఢిల్లీ,:** ఇంకొద్ది రోజుల్లో వార్షిక బడ్జెట్.. పార్లమెంట్ ముందుకు రానుంది. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనపై కసరత్తు తుదిదశకు చేరుకుంది. ఈ ప్రతిపాదనలన్నీ కూడా దాదాపుగా కొలిక్కివచ్చినట్టే. పన్నుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందనేది బహిరంగ రహస్యమే. దేశంలో ట్యాక్స్ టెర్రరిజం కొనాగుతోందని, నానా రకాలుగా ట్యాక్సులను వసూలు చేస్తోన్నారంటూ మొన్నటికి మొన్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సైతం ఆరోపణలు గుప్పించారు. సంవత్సరానికి 10 లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్న మధ్య తరగతి ప్రజలు లెక్కలేనని పన్నులను చెల్లించాల్సి, వస్తోందని కేజ్రీవాల్

## మన హైదరాబాద్‌కు విలువైన మొక్కలను తీసుకువచ్చారు

- రంగారెడ్డి జిల్లాలో 150 ఎకరాల్లో ఎక్స్‌పీరియం పార్క్‌ను తీర్చిదిద్దిన రాందేవ్ రావు
- పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి.. పాల్గొన్న చిరంజీవి
- తనకు రాందేవ్ రావు అరుదైన మొక్కలు ఇచ్చారని వెల్లడి
- రియల్ ఎస్టేట్ బిజినెస్ కాకుండా... పార్క్‌ను తీర్చిదిద్దారని కితాబు



**హైదరాబాద్, :** విలువైన భూమి ఉంటే ఎవరైనా రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసుకుంటారని, కానీ రాందేవ్ రావు ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును ఏర్పాటు చేశారని మెగాస్టార్ చిరంజీవి కొనియాడారు. హైదరాబాద్‌కు విలువైన మొక్కలను తీసుకువచ్చారన్నారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో 150 ఎకరాల్లో రాందేవ్ రావు ఈ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో 25 వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఈ పార్కులో రూ.1 లక్ష నుంచి రూ.3.5 కోట్ల విలువ చేసే అరుదైన

# నేడే మౌనీ అమావాస్య..

## ఒక్క రోజే కుంభమేళాలో 10 కోట్ల మంది పుణ్య స్నానాలు

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే 15 కోట్ల మంది మహాకుంభ్‌లో అమృత స్నానాలు చేశారు. అయితే మౌనీ అమావాస్య సందర్భంగా .. కుంభమేళాకు ఒక్క రోజే సుమారు పది కోట్ల మందికిపైగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీని కోసం యూపీ సర్కారు భారీగా ఏర్పాట్లు చేస్తున్నది. గడిచిన 17 రోజుల్లో ప్రతి రోజూ సుమారు కోటి మంది వరకు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. బుధవారం మౌనీ అమావాస్య కోసం భారీ ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఏఐ ఆధారిత సీసీ కెమెరాలను అమర్చారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌ను నో వెహికిల్ జోన్‌గా ప్రకటించారు. సంగంకు వెళ్లే స్థానికులు ఫోర్ వీలర్లను కాకుండా, టూ వీలర్లను వాడాలని ప్రభుత్వం సూచించింది.

మౌనీ అమావాస్య ప్రత్యేకతేంటి..

మౌనీ అమావాస్య రోజున నదీ స్నానం విశేషమైంది. మహాకుంభమేళాలో అమావాస్య రోజున నిర్వహించే స్నానాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో రేపు ఉదయం 6.45 నిమిషాలకు .. త్రివేణి సంగమంలో స్నానం ఆచరించే భక్తులపై పూలవర్షం కురిపించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. షాహి స్నానం నిర్వహించే తేదీల్లో.. నాగ సాధువులు, అకాడాలు భారీ ర్యాలీగా నదీ తీరానికి చేరుకుంటారు. అమృత స్నాన దినాల్లో అదే ఆకర్షణీయమైంది. అయితే సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి.. ఒకే రేఖలోకి రావడం వల్ల.. పవిత్ర నదుల ఆధ్యాత్మిక శక్తి మరింత దిగ్విణీకృతం అవుతుందని భావిస్తారు. హిందూ క్యాలెండర్‌లోని మాఘ కృష్ణ అమావాస్య రోజున.. మౌనీ అమావాస్య వస్తుంది. అమృత స్నాన దినాల్లో.. మౌనీ అమావాస్య స్నానమే ప్రత్యేకమైందిగా భావిస్తారు. ఈ రోజున పవిత్ర నదీ జలం అమృతంలా మారుతుందని చెబుతుంటారు. మౌనీ అమావాస్యను సాధువులు స్నానం చేసే రోజు అని కూడా పేర్కొంటారు. సాంప్రదాయకర రీతిలో మౌనంగా మౌనీ అమావాస్య రోజున స్నానాన్ని ఆచరిస్తారు. జనవరి 28, 29, 30 తేదీల్లో ప్రయాగ్‌రాజ్‌లో స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

## ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సంచలన లేఖ

మొదటి పేజీ తరువాయి

ధనికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయకుండా ఒక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు కేజ్రీవాల్. "కేంద్ర ప్రభుత్వం బిలియనీర్లకు అనుకూలంగా పేదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. ధనికులకు వేలకోట్ల కార్పొరేట్ లోన్స్ ను మాఫీ చేస్తోంది. ఇలాంటి చర్యల వల్ల సాధారణ ప్రజలపై పన్నుల భారం అధికమవుతోంది. సాధారణ ప్రజలు తమ జీతాల్లో సగం డబ్బును టాక్స్ రూపంలో కడుతున్నారు. మరి మోదీ సర్కార్ పేదలు తీసుకున్న లోన్ లను ఎందుకు మాఫీ చేయదు. ప్రజల హోం లోన్, కార్ లోన్ లను మాఫీ చేయొచ్చు కదా..?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. బిలియనీర్లకు లోన్ మాఫీ చేయడాన్ని తక్షణమే ఆపేయాలని, నిత్యావసరాలపై జీఎస్టీ రేట్లను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేస్తోందని.. కానీ బీజేపీ మాత్రం వాళ్ల స్నేహితులకోసం ఖర్చు చేస్తుందని మండిపడ్డారు. ఢిల్లీ ప్రజలకు విద్య, వైద్యం, ఫ్రీ బస్, ఫ్రీ విద్యుత్, తాగునీటి సరఫరా.. అన్నీ ఇచ్చామన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న 20 రాష్ట్రాల్లో పవర్ కట్స్ ఉన్నాయన్నారు. చీపురు గుర్తుకు ఓటేస్తే 24 గంటలు విద్యుత్ ఉంటుందని.. కమలానికి ఓటేస్తే కనీసం 6 గంటలు పవర్ కట్స్ ఉంటాయని కేజ్రీవాల్ తెలిపారు.

## రెండు విడుతలుగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..

మొదటి పేజీ తరువాయి

తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. మంగళవారం విడుదలైన పార్లమెంటరీ బులిటెన్ ప్రకారం.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడుతారు. అంతకుముందు రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి. పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు ప్రతిపక్ష నాయకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిందని.. ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్ బాగుటుందని అందరూ ఆశిస్తున్నారని తెలిపారు.

## రేవంత్ రెడ్డిపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు

**హైదరాబాద్, :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎంపై ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తదితరులు ఉన్నారు. ఫార్ములా ఈ-రేస్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని, కాబట్టి ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన మంచి పనులను ఈ ముఖ్యమంత్రి ముందుకు తీసుకువెళ్లాలన్నారు. గత ప్రభుత్వం చేసిన పనులను ముందుకు తీసుకువెళ్లకుండా నిధులు వృథా చేయడం ద్వారా రేవంత్ రెడ్డి నిందితుడు అయ్యారని విమర్శించారు. ఫార్ములా ఈ రేస్‌పై సీఎం తీరు వల్ల తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్ నడిబొడ్డున ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ యావత్ భారత్ తెలంగాణ వైపు చూసేలా చేసిందన్నారు. ఎక్కడో విదేశాల్లో జరిగే ఫార్ములా ఈ-రేస్ హైదరాబాద్?లో నిర్వహించడం పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారన్నారు.

## ఏపీపై మోదీ స్పెషల్ ఫోకస్ సంతుష్టీకరణ-తాయిలాలు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

సంవత్సరానికి 10 లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్న మధ్య తరగతి ప్రజలు లెక్కలేనని పన్నులను చెల్లించాల్సి,వస్తోందనికేజ్రీవాల్ ధ్వజమెత్తారు. టీచర్లు, లాయర్లు, వేతన జీవులు.. ఇలా అన్ని రంగాలకు చెందిన ఉద్యోగులు విపరీతంగా పన్నులను చెల్లిస్తోన్నారని, ఇది ట్యాక్స్ టెర్రరిజమని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల మధ్య కేంద్ర మంత్రివర్గం బుధవారం సమావేశం కాబోతోంది. ఉదయం 10 గంటలకు ఈ భేటీ ఏర్పాటుకానుంది. ప్రదానమంత్రి నరేంద్ర మోదీ దీనికి అధ్యక్షత వహించనున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు పార్లమెంట్ ఉభయ సభల ముందుకు రాబోతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మంత్రివర్గం భేటీ కాబోతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2025-2026 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలే ప్రధాన అజెండా. దాదాపుగా తుది రూపాన్ని సంతరించుకుంటోన్న నేపథ్యంలో.. దీనిపై విస్తృతంగా మంత్రివర్గం చర్చించే అవకాశాలు ఉన్నాయి. రక్షణ మంత్రిత్వ శాఖతో పాటు, వ్యవసాయం, రైల్వేలు, జాతీయ రహదారులు వంటి రంగాలకు ఎంత మొత్తంలో బడ్జెట్‌ను కేటాయించారనే విషయం ప్రధానంగా ప్రస్తావనకు రావొచ్చు. విద్య, వైద్యం, డిజిటల్ ఇండియా, పీఎంఏవై, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, వాటికి కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు కేటాయించే నిధులపై చర్చ జరగొచ్చు. ప్రధానంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగానికి చెందిన పరిశ్రమలకు రాయితీలను ఇచ్చే అవకాశాలు లేకపోలేదీసారి బడ్జెట్‌లో. జీఎస్టీ శ్లాబుల విధానం, పన్నులు, వేతన జీవులకు ఊరట కల్పించడం వంటివి చర్చించే అవకాశం ఉంది. గత ఏడాది తరహాలోనే ఇప్పుడు కూడా ఎన్డీఏలో కీలక భాగస్వామ్య పార్టీలు తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యునైటెడ్) అధికారంలో ఏపీ, బిహార్‌లకు అంచనాలకు అనుగుణంగా తాయిలాలను ప్రకటించవచ్చని తెలుస్తోంది. ఈ మేరకు ఈ రెండు రాష్ట్రాలు ఇదివరకే అందజేసిన ప్రతిపాదనలు కూడా మంత్రివర్గంలో చర్చకు వస్తాయని చెబుతున్నారు.

## అప్పులు పుట్టడం లేదని సాకులు చెప్పొద్దు..

**అమరావతి,:** కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం ఇచ్చిన ప్రజెంటేషన్ ఇందుకు నిదర్శనమని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాఫ్ అని ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలని నీతి సూక్తులు చెప్పారని చంద్రబాబుపై షర్మిల మండిపడ్డారు. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలంటున్నారని.. మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు అని విమర్శించారు. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారని ఆరోపించారు. 50 లక్షల మంది అన్నదాతలను వంచించారని.. 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారని.. కోటిన్నర మంది మహిళలను మోసం చేశారని.. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని, గత వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని చంద్రబాబు చెప్పారని షర్మిల గుర్తుచేశారు. జగన్ ఆర్థిక ఘోరమే నిదర్శనమని చెప్పే బాబు గారు.. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు తెలియదా ఈ ఆర్థిక విధ్వంసం, ఘోరమని నిలదీశారు. 'సూపర్ సిక్స్' పథకాల రూపకల్పనలో కనపడలేదా రాష్ట్ర ఆర్థిక భారమని ప్రశ్నించారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరే అని గుర్తుచేశారు. కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరేనని.. తీరా ఓట్లు పడ్డాక ఇచ్చిన హామీలపై మడతపేచీ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు పుట్టడం లేదని సాకులు వెతకడం మాని.. పథకాల అమలుపై దృష్టి పెట్టాలని ఏపీ కాంగ్రెస్ తరఫున షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే మీరు.. రాష్ట్ర దీనస్థితిపై ప్రధాని మోదీని పట్టుబట్టాలన్నారు. పథకాలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగాలని.. నీతి ఆయోగ్ చెప్పినట్లుగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకంపై వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చాలన్నారు. పథకాలకు కేంద్రం డబ్బులివ్వకపోతే వెంటనే బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోవాలని సూచించారు.

# పెట్టుబడులపై కొంతమంది దుష్ప్రచారం చేశారు

మొదటి పేజీ తరువాయి

ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. దావోస్ ద్వారా దాదాపు రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించామన్నారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు.

ప్రపంచస్థాయి ఎక్స్‌పీరియం పార్క్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్.. పాల్గొన్న చిరంజీవి



**హైదరాబాద్, :** తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్క్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏకంగా 150 ఎకరాల్లో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న 25 వేల జాతుల మొక్కలు, వృక్షాలు ఉన్నాయి. అలాగే రూ. 1 లక్ష నుంచి రూ. 3.5 కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలను కూడా అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు వృక్షాలను సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపార ప్రముఖులు కొనుగోలు చేశారు. రూ. 150 కోట్ల విలువైన మొక్కలు, చెట్లు, వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక ప్రాంతం ఈ ఎక్స్‌పీరియం పార్క్. దీని కోసం రాందేవ్‌రావ్ ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఈ పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఏకంగా 1500 మంది కూర్చునేలా యాంఫీ థియేటర్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... "ఎకో టూరిజంపై ఇటీవలే అసెంబ్లీలో చర్చించాం. పర్యాటక పాలసీ తీసుకొచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సాహిస్తాం. అటవీ ప్రాంతాల సందర్శన కోసం మధ్యప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఆలయాల దర్శనాల కోసం తమిళనాడుతో పాటు ఇతర ప్రాంతాలకు వెళుతున్నాం. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత ప్రభుత్వాలు దృష్టి సారించలేదు" అని అన్నారు.

# మన హైదరాబాద్‌కు విలువైన మొక్కలను తీసుకువచ్చారు

మొదటి పేజీ తరువాయి



85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఈ పార్కులో రూ.1 లక్ష నుంచి రూ.3.5 కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలు ఉన్నాయి. పలువురు ప్రముఖులు ఇక్కడి మొక్కలను కొనుగోలు చేశారు. రాందేవ్ రావు ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఎక్స్‌పీరియంను తీర్చిదిద్దారు. రాక్ గార్డెన్, 1500 మంది కూర్చునేలా యాంపీ థియేటర్ తదితరాలను ఏర్పాటు చేశారు. ఈ పార్కును ఈరోజు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ మాట్లాడుతూ... పొద్దుటూరు ప్రదేశం తనకు ముందే తెలుసన్నారు. తాను ఇల్లు కట్టుకున్నప్పుడు రాందేవ్ తనకు కొన్ని మొక్కలు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. మా ఇంట్లో పెంచుకుంటున్న ఆ మొక్కలను చూస్తే తనకు ఎంతో ఆహ్లాదకరంగా అనిపిస్తుందన్నారు. హైదరాబాద్‌కు ఇలాంటి మొక్కలను తీసుకురావడం అభినందనీయమన్నారు. రాందేవ్ తనకు వ్యాపారవేత్తలా కాకుండా కళాకారుడిలా కనిపించాడని కితాబునిచ్చారు. "రాందేవ్‌తో నా పరిచయం ఇప్పటిది కాదు. ఈ ఎక్స్‌పీరియం పార్కుని మీ అందరి కంటే ముందుగా నేను చూశాను. 2000వ సంవత్సరంలోనే దీని గురించి రాందేవ్ నాతో పంచుకున్నారు. 2002 నుంచి నేను కూడా రాందేవ్ వద్ద నుంచి మొక్కల్ని తెప్పించుకుంటూనే ఉన్నాను. మా ఇంట్లో ఉండే అనేక రకాల మొక్కలు, చెట్లు రాందేవ్ వద్ద నుంచి వచ్చినవే. రాందేవ్ ఓ వ్యాపారవేత్తగా ఎప్పుడూ ఆలోచించరు. పర్యావరణం, ప్రకృతి గురించి ఆలోచిస్తుంటారు. ఈ 150 ఎకరాలను వాణిజ్యంగానూ వాడుకోవచ్చు. కానీ ఆయన ఈ 25 ఏళ్లుగా రకరకాల మొక్కల్ని, వివిధ దేశాల నుంచి కొత్త జాతి మొక్కల్ని ఇక్కడకు తీసుకొచ్చి ఈ పార్కుని నిర్మించారు. ఈ రకంగా రాం దేవ్ ఓ మంచి ఆర్టిస్ట్ అని చెప్పుకోవచ్చు. ఈ ఎక్స్‌పీరియం పార్కుని చూసి నేను, గౌరవనీయులు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు షాక్ అయ్యాం. ఇంత అద్భుతంగా ఉన్న ఈ పార్కుని చూసి షూటింగ్‌కు ఇస్తారా? అని రాందేవ్‌ను అడిగాను. ఫస్ట్ షూటింగ్ చేసేది నా సినిమానే అయితే ఇస్తామని అన్నారు. కానీ ఈ ఎండలో నేను ఇక్కడ హీరోయిన్‌తో స్టెప్పులు వేయడం అంటే కాస్త కష్టమే. వర్షాకాలం తరువాత ఇక్కడ మరింత పచ్చదనం వస్తుంది. ఆ టైంలో షూటింగ్ చేస్తే అద్భుతంగా ఉంటుంది. వెడ్డింగ్, రిసెప్షన్, ఇతర కార్యక్రమాలకు ఈ చోటు అనువైనదిగా ఉంటుంది. దేశవిదేశాల్లో ఉండే ఎన్నో అరుదైన జాతి మొక్కల్ని ఒక చోటకు చేర్చి ఇంత అద్భుతమైన పార్కుని రాం దేవ్ నిర్మించారు. ఇలాంటి మహోత్తర కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి గారు రావడం అభినందనీయం. ఆయన ఎంత బిజీగా ఉన్నా కూడా ఇలాంటి ప్రకృతి, పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలకు రావడం ఆనందంగా ఉంది" అని చిరంజీవి వివరించారు. ఇలాంటి ప్రదేశానికి ప్రభుత్వం నుంచి కూడా సహకారం ఉండాలన్నారు. ఈ పార్క్ మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# టీడీపీలో వీరికే నామినేటెడ్ పదవులు

మొదటి పేజీ తరువాయి



ఇందులో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై చర్చించారు. అలాగే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చరిత్రలో తిరుగులేని విజయాన్ని అందించిన ప్రజలు, కార్యకర్తల ఆశలు తీర్చేందుకు, ఆకాంక్షల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని చంద్రబాబు నేతలకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వ పని తీరును నిరంతరం పర్యవేక్షించుకుంటూ, మెరుగుపరుచుకుంటూ పనిచేయాలన్నారు. 7 నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తాం...ఈ విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలన్నారు. గత 5 ఏళ్లు కార్యకర్తలు తిరుగులేని పోరాటం చేశారని, వారి కష్టం ఫలితమే మొన్నటి ఎన్నికల విజయం అని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తలను ఎప్పుడూ గౌరవించుకోవాలన్నారు. ఎన్నికలు అయిపోయాయి నేను ఎమ్మెల్యే, ఎంపి అయిపోయాను అని ఎవరూ భావించవద్దన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు క్యాబ్స్(క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్) విభాగాల్లో సభ్యులుగా ఉండాలని కండిషన్ పెట్టారు. పదవులు పొందే ప్రతి ఒక్కళ్లు పార్టీ స్ట్రక్చర్ అయిన క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్‌లో ఉండాలన్నారు. అలాంటి వారినే పదవుల కోసం నాయకులు సిఫారసు చేయాలన్నారు. ఏ స్థాయి వారు అయినా క్యాబ్స్‌లో మెంబర్‌గా ఉండాలన్నారు. 214 మార్కెట్ కమిటీలు ఉన్నాయని, 1100 ట్రస్ట్ బోర్డులు ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. జూన్‌లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు పూర్తి చేస్తామన్నారు.పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తామని, దాని ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయన్నారు. మెంబర్ షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తామన్నారు. మంత్రులు జిల్లాల్లో ఎమ్మెల్యేలతో కూర్చుని పార్టీ అంశాలపై చర్చించాలని, సమస్యలు పరిష్కరించాలని చంద్రబాబు ఆదేశించారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు చెల్లించేలా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు పని చేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి నిన్న మొన్న వచ్చి చేరిన వారి కంటే, ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు.మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే అన్నారు. ప్రజల్లో సంతృప్తి ఉండాలని, భవిష్యత్‌పై నమ్మకం, భరోసా కలగాలని, ఇదే కూటమి ప్రభుత్వ విధానం అని తెలిపారు. ఇప్పుడు ప్రజలకు ఏం చేస్తాం...భవిష్యత్ లో ఏం ఇస్తాం అనేది ప్రజలకు పార్టీ నేతలు వివరించాలన్నారు.పథకాలన్నీ ఇస్తాం...వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని సూచించారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని అడుగుతున్నా : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



'పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ ఆనాడు మొత్తం రాష్ట్ర రైతాంగానికి సాయుధపోరాటంలో ఎట్లైతే స్ఫూర్తిని నింపిందో.. మళ్ల ఇప్పుడు గూడా అట్లనే నల్లగొండనే స్ఫూర్తి కావాలె. రైతులు తిరగబడుతందుకు నల్లగొండనే వేదిక కావాలె. అందుకే నల్లగొండ నుంచే ఈ రైతు పోరు మొదలుపెట్టినం. ఇంకా నాలుగేండ్ల సమయం ఉంది. మిమ్మల్ని అందరినీ నేను ప్రార్థించేది ఒక్కటే. కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధిచెప్పాలె. కేసీఆర్ తయారు చేసిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు అందరూ మీకు మద్దతు ఉంటరు. ఈ ప్రభుత్వంలో రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతా అనే మంత్రి ఒకడున్నడు. మీటింగ్ పెట్టుకుంటమంటే అడ్డుకునే సన్నాసి మంత్రి ఒకడున్నడు. భూపాల్‌రెడ్డిని తీస్కపోయి పోలీస్‌స్టేషన్‌ల దాడి చేసిండు. నీకు సిగ్గుందా అని అడుగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీకు ధైర్యం ఉంటే, దమ్ముంటే గడియారం సెంటర్‌కు రా. మా లెక్కనే వచ్చి మీటింగ్ పెట్టి రైతులకు మీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పు' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ చేశారు. 'ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆకారాలు బాగా పెరిగినయ్. అహంకారాలు బాగా పెరిగినయ్. కానీ నల్లగొండకు వాళ్లు చేసిందేమీ లేదు. కానీ కేసీఆర్ ఏం చేసిండని మాట్లాడుతరు. కేసీఆర్ ఏం చేసిండో చెప్తున్నా. వరి ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ చేసిండు. నల్లగొండను తెలంగానలోనే నెంబర్ వన్ చేసిండు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిలో మూడు మెడికల్ కాలేజీలు కట్టిచ్చిండు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది లక్ష్మీ నరసింహస్వామి రుణం తీర్చుకున్నడు. దామరచర్లలో తెలంగాణలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కట్టిచ్చిండు. చెప్పుకుంటే పోతే ఒకటి రెండు కాదో ఎన్నో పనులు చేసినం. దమ్ముంటే క్లాక్ టవర్‌కు రా.. మా భూపాలన్న, జగదీష్ అన్న వస్తరు. నీ సంగతి చెప్తరు' అని కేటీఆర్ హెచ్చరించారు. 'మనం హైకోర్టుకు ధన్యవాదాలు చెప్పాలె. మన న్యాయవ్యస్థకు ధన్యవాదాలు చెప్పాలె. ఎందుకంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసినా, రైతుల పోరాటంలో న్యాయం ఉందని అర్థం చేసుకుని ఇయ్యాల మనం ధర్నా చేసుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. సీఎం రాజ్‌భవన్ ముందు ధర్నా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది కాదటగానీ, మనం ఇక్కడ ధర్నా చేస్తే ప్రభుత్వానికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇబ్బంది అయితదట. నేను పోలీస్ అధికారులకు, జిల్లా అధికార యంత్రాంగానికి గుర్తుచేస్తున్న. మరిచిపోకండి. భవిష్యత్తు కచ్చితంగా గులాబీ జెండాదే. ముమ్మాటికి తిరిగివస్తాం. ఇయ్యాల ఎవరైతే కాంగ్రెస్ కార్యకర్తల కంటే అతిగా ప్రవర్తిస్తున్నరో అన్ని గుర్తుపెట్టుకుంటున్నం. వడ్డీతో సహా ఇస్తం. యాదికి పెట్టుకోండి' అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

## సులభతర వాణిజ్యంలో ఏపీని మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయండి

**అమరావతి,:** సులభతర వాణిజ్యం విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గత పదేళ్లలో ఎక్కువ పర్యాయాలు దేశంలో మొదటి స్థానంలో నిలవడం జరిగిందని, ఆ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు సంబంధిత శాఖలు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై సోమవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్ అనేది ప్రపంచ బ్యాంక్ గ్రూప్ స్థాపించిన ర్యాంకింగ్ వ్యవస్థ అని, వ్యాపారాలకు మెరుగైన, సరళమైన నిబంధనలు అందుబాటులో ఉంటే సులభతర వాణిజ్యానికి అవకాశం ఉంటుందని తెలిపారు. 2024లో పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం నేతృత్వంలోని వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బీఆర్ఏపీ) 2024 ద్వారా వ్యాపారం చేయడంలో సౌలభ్యాన్ని పెంచడంపై భారతదేశం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. సులభతర వాణిజ్య విధానంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఆ దిశగా ఆయా శాఖలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ఏపీని మొదటి స్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ (బీఆర్ఏపీ) 2024కు సంబంధించి ఫిబ్రవరి 15 తుది గడువుగా నిర్ణయించిందని, కావున 10వ తేదీలోగా సంబంధిత శాఖలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించిన కంప్లయన్స్ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించి ఇంకా కొన్ని శాఖలు నోడల్ అధికారులను నియమించాల్సి ఉందని, వారిని వెంటనే నియమించాలని అన్నారు. తొలుత రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్ యువరాజ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

## ఆంధ్రప్రదేశ్ లో జిల్లాకో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ లో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. వీటిని అరికట్టడానికి జిల్లాకు ఒక సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆయన శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ ను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించి తద్వారా నేరస్థుల బారిన పడకుండా జాగ్రత్తపడేలా చూస్తున్నామని వివరించారు. ఇటీవల చిన్నపిల్లలపై, వృద్ధులపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, ఇది సభ్య సమాజం సిగ్గుపడాల్సిన విషయమని డీజీపీ అన్నారు.

గంజాయి నివారణకు ఈగల్..

రాష్ట్రంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా మూలాలు మాత్రం ఉత్తరాంధ్రలోనే ఉంటున్నాయని డీజీపీ చెప్పారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ఈగల్ సంస్థను ఏర్పాటుచేసి ఎక్కడికక్కడ నియంత్రిస్తున్నట్లు వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసులు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కూడా గంజాయి నిర్మూలన కోసం క్యాబినెట్ మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసిందని డీజీపీ గుర్తుచేశారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు..

టెక్నాలజీ సాయంతో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్ లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని డీజీపీ తెలిపారు. ఎక్కడ ఎలాంటి నేరం జరిగినా ఏదో ఒక కెమెరాలో రికార్డయ్యేలా సీసీ కెమెరాలను అమర్చుతున్నామని చెప్పారు. మార్చి 1 నాటికి మొత్తం లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుని ఆ దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం దాతలు, ప్రజల సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు.

## అంబులెన్స్ సిబ్బందిని ప్రశంసిస్తున్నారు పలువురు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలానికి కి చెందిన లక్ష్మి 26 అనే గర్భవతి పురిటి నొప్పులు రావడం తో 108 వాహనానికి ఫోన్ చేయగా హుటాహుటిన వచ్చిన అంబులెన్స్ గర్భవతి ని బాన్సువాడ మాత శిశు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో చెట్లూర్ సమీపం లో గమనించిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రవి మరియు అంబులెన్స్ పైలెట్ సతీష్ లు ఆమె కి పురుడు పోయడంతో పండంటి మగ బిడ్డను జన్మనిచ్చిన ఆమె అబులెన్స్ సిబ్బంది కి ధన్యవాదాలు తెలియచేశారు అనంతరం ఆమెను మాతా శిశు ఆసుపత్రి బాన్సువాడ లో చేర్పించడం జరిగింది.

## రామగుండం నగరపాలక
## సంస్థ కార్యాలయంలో మెప్మా ప్రతినిధులతో సమావేశం
### కొత్త స్వశక్తి సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వండి
### నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) సంఘాలలో లేని పేద మహిళలను గుర్తించి కొత్త సంఘాలను ఏర్పాటు చేయించాలని మెప్మా సిబ్బందిని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం ధన శ్రీ పట్టణ సమాఖ్య ప్రతినిధులు , ఆర్ పి లతో



సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త స్వశక్తి సంఘాల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని అన్నారు . అలాగే అర్హత లేని సభ్యులను , పని చేయని సంఘాలను గుర్తించి తొలగించాలని అన్నారు. స్వశక్తి సంఘాలకు బ్యాంక్ లింకేజ్ ఇప్పించాలని అన్నారు. స్త్రీ నిధి ద్వారా భీమా సౌకర్యంతో పాటు విస్తృత ప్రయోజనాలు ఉన్నందున అమలు చేయడానికి ధన శ్రీ పట్టణ సమాఖ్య సహకారం అందించాలని అన్నారు. పి ఎం స్వనిధి లో బాగంగా మరికొంత మంది వీధి వ్యాపారులకు ప్రయోజనం కలగడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. స్వశక్తి సంఘాల , వీధి వ్యాపారుల ఎన్ పి ఎ జాబితా పై దృష్టి సారించి ఋణ బకాయలు వసూళ్లయ్యేందుకు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో మెప్మా డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ సతీష్ బాబు , స్త్రీ నిధి సంస్థ రీజనల్ మేనేజర్ దుర్గా ప్రసాద్, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ మౌనిక , సి ఓ లు ఊర్మిళ , శ్వేత , శమంత , ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ హజ్రత్ తాజుద్దీన్ బాబా
## జన్మదిన ముగింపు లో భాగంగా కూల్ పుణ్యా వచనం



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) స్థానిక 46వ డివిజన్ కాకతీయ నగర్ లోని హజ్రత్ తాజుద్దీన్ బాబా నిర్వాహకులు నారదాసు సతీష్ రావు ఆధ్వర్యంలో బాబా జన్మదిన ముగింపు కార్యక్రమంలో భాగంగా దర్బార్ లో "కూల్ పుణ్యా వచనం" కుల మతాలకు అతీతంగా భజనలు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
## వివిధ డివిజన్ ల లో అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలి
### పెద్దపెల్లి జిల్లా అదనపు కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి(శుభోదయం న్యూస్)ఉపరితల మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడానికై వాహనాలు వెళ్ళడానికి ఆటంకంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ లలో పలు సమస్యలను మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ముప్పది రెండవ డివిజన్ ఎల్ బి నగర్ లో ఇండ్ల మధ్య ఉన్న పెద్ద కాలువలో పూడిక తొలగించడానికి వాహనం వెళ్లడానికి ఇబ్బందవుతున్న దృష్ట్యా అడ్డుగా ఉన్న గోడ లను తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. పెద్ద పెద్ద కాలువల్లో యంత్రాలతోనే శుభ్రం చేయించాలని అన్నారు. ఇరవై మూడవ డివిజన్ లోని అంబేద్కర్ కాలనీలో గుంతలోని మురుగు నీటిని సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనం సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. సమస్య శాశ్వత పరిష్కారం కొరకు తగు చర్య తీసుకోవాలని ఆదేశించారు. ఇరవై రెండవ డివిజన్ లో నల్లా పైపులలో ఏర్పడిన లీకేజీ ని పరిశీలించి వెంటనే మరమ్మత్తు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాయలింగు, ఇ ఇ రామన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార స్వామి , పారిశుధ్ధ్య పర్యవేక్షకులు యూసుఫ్ , రాజబాబు , సంపత్ , సోమేష్ తదితరులు ఉన్నారు.

# ఎన్టీపీసీ టీటీఎస్ జిల్లా పరిషత్
# హైస్కూలు గ్రౌండ్ లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

## రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎన్ టి పి సి అధికారులు పాల్గొన్నారు



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్)ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాలు అయినటువంటి కాశిపల్లి,మాతంగికాలనీ,ఎలుకలపల్లి , లక్ష్మీపురం,ఎలకలపల్లి గేట్, గుంటూరుపల్లి, కాశిపెల్లి, కుందనపల్లి, మల్లెలపల్లి, రాజాపురం,మేడిపల్లి, అన్నపూర్ణ కాలనీ,చల్లపల్లి, దుర్గా పల్లి, గోలి వాడ, మల్కాపురం, వీర్లపల్లి, రానాపురం, కన్నాల, బాబుల నాయక్ తండ, జంగాలపల్లి, మొదలగు గ్రామాల ప్రజలు ఎన్టీపీసీ వలన అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆయా గ్రామాల ప్రజల శ్రేయస్సు కోసం, వారి ఆరోగ్యం కోసం అదేవిధంగా ఆయా గ్రామాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పన గురించి ఎమ్మెల్యే శ్రీ మక్కాన్ సింగ్ గారు అధికారులకు ఆయా గ్రామాల ప్రజలతో కలిసి తమ అభిప్రాయాలను వెల్లడించారు.జిల్లాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ లబ్బర్ స్టాంప్ గా వ్యవహరిస్తుంది ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిని ఎన్టిపిసి ఈ యాజమాన్యం విస్మరిస్తుందని అన్నారు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్.స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు ప్రాధాన్యత





కల్పించాలి డిమాండ్ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.కాంట్రాక్ట్ కార్మికుల నియామకాల విషయంలో అవినీతి జరుగుతుంది కలెక్టర్ గారి ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.నీరు నిధులు నియమాకాల విషయంలో ఎన్టిపిసి యజమాన్యం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు ఎన్టిపిసి అధికారులు ప్రజల పట్ల మర్యాదగా వివరించాలని లేదంటే ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు అనేసి హెచ్చరించారు రోడ్లుచెరువులు పట్టణ అభివృద్ధి పనులు సి ఎస్ ఆర్ నిధులు ఖర్చు చేయాలన్నారు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మార్వో కార్యాలయం నుండి కమిషనర్ ఆఫ్ పోలీసు కార్యాలయం వరకు అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలి.ఎమ్మార్వో కార్యాలయం నుండి ఎన్టీపీసీ పి టి ఎస్ మెయిన్ గేట్ వరకు నిరుపయోగంగా ఉన్న 8 హై టెన్షన్ టవర్లను తొలగించాలి.పోలీస్ కమిషనర్ కార్యాలయం మరియు సోలార్ ప్లాంట్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక్క అధునాతన స్టేడియం స్థానిక ప్రజల ఉపయోగార్థం నిర్మించాలి.గోదావరిఖని మరియు గోలి వాడ సమ్మక్క జాతర జరిగే అభివృద్ధి చేసి దేవాదాయ శాఖకుఅప్పగించాలి.ఎన్టీపీసీ పోలీసు స్టేషన్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ మధ్యలో పెట్రోల్ బాంక్ నిర్మాణం కోసం 100ఎం%శ%100ఎం స్థలాన్ని కేటాయించాలి.ఎన్టీపీసీ ప్రస్తుతం ఉన్న ప్లాంట్లలో మరియు రాబోయే ప్లాంట్లలో స్కిల్డ్, సెమి- స్కిల్డ్, అన్- స్కిల్డ్ క్యాటగిరి లలో 100 శాతం స్థానిక నిరుద్యోగ యువతకు మాత్రమే ఉపాధికల్పించాలి.కాలుష్యం భారిన పడుతున్న మతాంగి కాలనీ ఇళ్లను తరలించి వారికి పునరావాసం కల్పించాలి.కాంట్రాక్టు ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అన్ని వసతులతో కూడిన హాస్పిటల్ ను ఏర్పాటు చేసి వైద్య సౌకర్యాలు అందించాలి.కాంట్రాక్టు కార్మికుల మరియు అవుట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలు మరియు అలవెన్స్ లు పెంచాలి.360 కోట్ల రూపాయలు ప్రభావిత డివిజన్ల మరియు గ్రామాలలో మౌలిక వసతుల అభివృద్ధి కొరకు కమ్యూనిటీ హాళ్లు, స్కూల్స్, రోడ్స్, డ్రైనేజీ, నిర్మాణం కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.సి.ఎస్ ఆర్ నిధులు కేవలము రామగుండం నియోజకవర్గంలో మాత్రమే ఖర్చు చేయాలి.రామగుండం చెరువుపునరుద్ధరణచేపట్టాలి.(యాష్ పౌండు)ఎన్టీపీసీ పోలీసు స్టేషన్ నుండి మార్కెట్ వరకు ఉన్న ఖాళీ స్థలంలో 100 షాప్ ల నిర్మాణం చేపట్టాలి.పైన పేర్కొన్న ప్రధాన డిమాండ్లను పరిశీలించి రామగుండం నియోజకవర్గంలో ఉన్నటువంటి ఎన్టీపీసీ సంస్థ రామగుండం అభివృద్ధికి అండగా ఉండాలని , ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల ప్రజల మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రజా అభిప్రాయ సేకరణ జరుగుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి తమ అభిప్రాయాలను తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్,ఎన్టీపీసీ ప్రభావిత ప్రజలు, మేయర్ అనిల్ కుమార్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ భూ నిర్వసీతులకు అండగా
## బిఆర్ఎస్ పార్టీ న్యాయం జరిగే వరకు పోరాడుతాం
### ప్రజాపాలనంటూ ప్రజల గొంతును నొక్కుతున్న పాలకులు
### మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్



రామగుండం మండల రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్)ఎన్ టి పి సి విద్యుత్ ప్లాంట్ కోసం తమ భూములను త్యాగం చేసిన ఎన్టిపిసి భూనిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని వారికి నష్టపరిహారం చెల్లించే వరకు పోరాడుతానని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ గారుఅన్నారు.నూతనంగా నిర్మాణం చేపట్టనున్న 2400 మెగావట్ల పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం మంగళవారం ఎన్ టి పి సి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఎన్టిపిసి ప్రభావిత ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని ఎన్టీపిసి పట్టణ బంధుకు, పిలిపించిన మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ ప్రజాభిప్రాయ సేకరణ జరిగే సభ స్థలానికి వెళుతున్న క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు మాట్లాడుతూ... రామ గుండంలోని ఎన్టీ పీసీ విద్యుత్ ప్రాజెక్ట్ దేశానికి వెలుగులు అంది స్తున్నా.. నిర్వాసి తుల కుటుంబాలు జీవితాల్లో చీకటి మయం చేస్తుందన్నారు. భూ నిర్వసీతులు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే అభిప్రాయ సేజరణ చేపట్టాలని డిమాండ్ చేసారు. ఎన్టీపీసీ లో ముఖ్య భూమిక పోషించిన




కాంట్రాక్టు కార్మికులను ఎన్టీపీసీ యాజమాన్యం విస్మరించిందని కార్మికుల పిల్లలకు మేరుగైనా విద్య వైద్యం సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ స్టేజ్-2లో చేపట్టే 2,400 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం కాలుష్యంగా మారుతుందన్నారు. విలువైన భూములు అందిస్తున్న నిర్వాసితులకు ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభావిత, పునరావాస ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి, మౌలిక వస తులు కల్పించాలని ఆయన కోరారు. కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి ఉచిత వైద్యం అందించాలని డిమాం డ్ చేశారు. కుందనపల్లి, మల్యాలపల్లె, అక్బర్నగర్, బద్రిపల్లె, మొఘల్పహాడ్, మాతంగి కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు.పవర్ ప్రాజెక్టు కింద భూములు త్యాగం చేసి సర్వస్వం కోల్పోయిన భూనిర్వాసితులకు ఎన్టీపిసి యజమాన్యం బెదిరింపులకు గురిచేస్తుందన్నారు తక్షణమే భూనిర్వాస్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు పోలీసుల అదుపులో తాజా మాజీ కార్పోరేటర్లు కన్నూరి సతీష్ కుమార్, ముదాం శ్రీనివాస్ కుమ్మరి శ్రీనివాస్ నల్ల వెంకటరమణ రెడ్డి పెంట రాజేష్ బిఆర్ఎస్ పార్టి నాయకుకు బొడ్డుపల్లి, శ్రీనివాస్,బొడ్డు రవీందర్ అచ్చే వేణు మెరుగు పోచం బండారి ప్రవీణ్ కొల్లూరు సతీష్ సందెల మల్లయ్య కొల్లూరి శరణ్య మధుకర్ రెడ్డి,పల్లె శ్రీనివాస్ బండారి శ్రీవాణి,కిరణ్, రానాపూర్ శ్రీనివాస్, గిట్ల లక్ష్మారెడ్డి, నిజాముద్దీన్ చిలుక ప్రసాద్ చిలుక శంకర్ నాంసాని శంకర్ తదితరులు ఉన్నారు.

## నిర్బంధం నీడలో ప్రజాభిప్రాయ సేకరణ సరికాదు
## ప్రభావిత ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా
## ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి
### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా
### కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) తేదీ 28:01:2025 నాడు ఎన్టిపిసి లోని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూలి ఎన్ టి పి సి సంస్థ ఏర్పాటులో ఇప్పటికే కుందనపల్లి మల్యాలపల్లి రాజాపురం మాతంగి కాలనీ కాజిపల్లి మొగల్పహాడ్ మేడిపల్లి బుచ్చయ్యపల్లి కృష్ణానగర్ మల్కాపురం ఎలుకలపల్లి వీర్లపల్లి లక్ష్మీపురం న్యూ పోరత్పల్లి గ్రామాల ప్రజలు నేటికీ పూర్తిస్థాయి నష్టపరిహారం లేక తమ కుటుంబాలను చిద్రం చేయడం జరిగింది. శాస్త్రీయ పునరావాసం కల్పించాల్సిన ఎన్ టి పి సి యాజమాన్యం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ఎన్ టి పి సి యాజమాన్యం తప్పుడు నివేదికలు ప్రజాభిప్రాయ సేకరణలో ప్రదర్శించి క్లియరెన్స్ టి ఓ ఆర్ తెచ్చుకున్నారు. మరిన్ని పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజాభిప్రాయ సేకరణకు ఎన్టిపిసి రామగుండం విస్తరణ ప్రాజెక్టు కు పూనుకుంటున్నది. ఈ ప్రాంత ప్రజలను చట్టం తెలియని అమాయకులుగా భావించి తాము రాసినవే గొప్పవి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎన్టిపిసి ఏర్పాటులో భూములు ఇచ్చిన వారికి నేటికీ ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేకపోగా మళ్లీ భూసేకరణ పేరుతో ముందుకు వస్తూ నిర్బంధం నీడలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతూ ఇక్కడి ప్రాంత ప్రజల పోరాటాన్ని తక్కువగా చూపే ప్రయత్నం ఎన్ టి పి సి యాజమాన్యం కొనసాగించడం తీవ్ర ఆక్షేపనీయం అభ్యంతరకరం. ఈ విధానాన్ని రామగుండం పారిశ్రామిక ప్రజలంతా తీవ్రంగా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిస్తున్నాం. ఎన్టిపిసి ఏర్పాటులో భూ నిర్వాసితులైన వారికి ఇచ్చిన హామీలను మొదటగా అమలు జరిపిన తర్వాత విస్తరణ కోసం భూసేకరణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం. పోలీసు పహారా మధ్య ప్రజలను స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను చెప్పుకునే వీలు లేకుండా నిర్బంధాన్ని ఉపయోగించి తమ అనుకూల శక్తులచే అనుకూల మాటలు మాట్లాడించుకొని సంబరపడి ఇక్కడి ప్రజలను ఇక్కడ యువతను గాలికి వదిలేసే చర్యలను విడనాడాలని ఎన్టిపిసి యాజమాన్యాన్ని హెచ్చరిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా స్వేచ్ఛగా ప్రజాస్వామ్య వాతావరణం మధ్యల తమ అభిప్రాయాలు చెప్పుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. నేడు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిగా నిర్బంధం నీడలో జరిగినందున దానిని రద్దుచేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఎన్టిపిసి ఏర్పాటు సందర్భంగా 25 వేల కుటుంబాలు కారు చౌక లో తమ శాశ్వత జీవనాధార వ్యవసాయ భూ ఉపాధిని త్యాగం చేసిన రైతులకు యువతకు భూసేకరణలో భూమి కోల్పోయిన కారణంగా 15 పట్టుమని 100 ఉద్యోగాలు కూడా ఇవ్వని ఎన్టిపిసి యాజమాన్యం నేడు మరొక్కసారి ప్రజలను మళ్లీ మోసగించేందుకు ముందుకు వస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎన్టిపిసి యాజమాన్యం చేస్తున్న కుటిల ప్రయత్నాలను త్రిప్పి కొట్టాలని ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాం ఇంకా ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులు తోకల రమేష్ గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, ఆడెపు శంకర్, గూడూరి వైకుంఠం, కలవల రాయమల్లు తూల్ల శంకర్, ఇనుగాల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నార.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి, (శుభోదయం న్యూస్) : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడిన వారు కృంగిపోక గెలిచినవారు గర్వపడకుండా క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి సూచించారు.ఈమేరకు మండల కేంద్రమైన పాపన్నపేటలో మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక జరిగింది.ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఇందులో సీనియర్ మెన్స్,సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్రీడాకారుల ఎంపిక



కొనసాగింది.సీనియర్ మెయిన్స్ విభాగంలో ఆసిఫ్,నిఖిల్,రాకేష్,పవన్ ,మేఘరాజ్,సిద్ధిరాములు,వికాస ్,ప్రకాష్,లోకేష్,నరేందర్ సాయి నిహాల్,చంటి,శివకుమార్,సుమిత్ర అశ్వినితో పాటు మొత్తం 36 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ రమేష్ వెల్లడించారు.ఈకార్యక్రమానికి నరేందర్ గౌడ్,సాయినాథ్ రావు దాతలుగా వ్యవహరించగా,అసోసియేషన్ సభ్యులు గోపాల్,కుమార్,రవి,శ్రీకాంత్ శివ శశి తదితరులు పాల్గొనగా ముఖ్య అతిథులుగా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,హెచ్ఎం మహేశ్వర్,మండల మాజీ విద్యాధికారి మోహన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# : నేటి నుండి అల్లమ ప్రభు జాతర





బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్ ): కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బొమ్మందేవ్ పల్లి గ్రామం లో కొండపై ఉన్న అల్లమా ప్రభు ఆలయ మహోత్సవాలను ఈరోజు నుండి ప్రారంభం కానున్నాయి.కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం అల్లామ ప్రభు అని భక్తుల నమ్మకం. మానవాళికి మార్గదర్శనం చూసేందుకే శివ పరమాత్ముడి అంశంతో భువిపై జన్మించాడని విశ్వాసం.అమావాస్య రోజు అగ్ని గుండం, కొండ కింద అన్నదానం,జాతర మహోత్సవం, రథోత్సవం కుస్తీ పోటీలు జరుగుతాయి. ఈ జాతర కు ఉమ్మడి జిల్లా భక్తులే కాకుండా పక్క రాష్ట్రాల నుండి అనేక మంది భక్తులు వస్తారు.ఈ ఉత్సవాలు ఈ నెల 31 వ తారీకు వరకు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

## బి సి సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన షబ్బీర్ అలీ



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్):బి సి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ని ఆవిష్కరిన చేసిన బి సి ,ఎస్ సి ,ఎస్ టి, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.ఈ సంధర్భంగా క్షేత్ర స్థాయిలో సంఘాలు బలోపేతం కావాలి అని ఆయన సూచనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాములు,విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు,యువజన సంఘం అధ్యక్షులు ఐరెని సందీప్,జిల్లా ఉపాధ్యక్షులు మోహనా చారి,విఠల్, మాజీ కౌన్సిలర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి విషయమై దాడి కేసు నమోదు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్ ): ఎల్లారెడ్డి మండలం గండి మాసానిపేట గ్రామానికి చెందిన తీర్చి బాబు వారి తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం, బాబు రెండవవాడు, మూడోవాడైన తీర్చి సురేష్ ఒక సంవత్సరం క్రితమే చనిపోయినాడు. తీర్చి బాబు బాబాయి అయిన తీర్చి బాలయ్యకు ఎలాంటి సంతానం లేకపోవడంతో గత కొన్ని రోజుల నుండి బాలయ్య బాగోగులను తీర్చి బాబు మరియు అతని అన్న అయినా సాయిలు ఇద్దరు చూసుకుంటున్నారు. అయితే బాలయ్య పేరు మీద ఉన్న నాలుగు గుంటల భూమిని అమ్ముకుని వాటాలు పంచుకుందామని బాబు అన్న అయిన తీర్చి సాయిలు గత కొన్ని రోజుల నుండి అడుగుతుండగా బాలయ్య తదనంతరం పంచుకుందామని అప్పటివరకు ఆగుదామని బాబు చెప్పగా ఈ విషయం మనసులో పెట్టుకొని కావాలనే బాబు ఇలా చేస్తున్నాడని ఈనెల తేది 26 నాడు తిరుచి సాయిలు మరియు అతని భార్య అనసూయ ఇద్దరు కలిసి దౌర్జన్యంగా బాబు ఇంట్లోకి ప్రవేశించి పొలాన్ని అమ్మనివ్వకుండా అడ్డుపడుతున్నావు అంటూ బాబుపై కర్రలతో దాడి చేయగా గాయాల పాలైనాడని బాబు భార్య శోభ ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చెయ్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో 76 వ గణతంత్ర దినోత్సవం లో ఉత్తమ ఎన్ సి సి బాలికల పరేడ్ క్యాడర్ కు అవార్డుల ప్రధానం



గవర్నర్ చేతుల మీదగా అవార్డు అందుకున్న నార్త్ లాలగూడకు చెందిన బాలిక ఖైరత్ ఉల్ ఐన్

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్):76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ ఎన్ సి సి బాలికల పరేడ్ అవార్డును ఖైరత్ ఉల్ ఐన్ అందుకున్నారు. ఈ యొక్క బాలిక సెయింట్ ప్యూస్ డిగ్రీ మరియు పీజీ మహిళ కాలేజ్ లో



చదువుచున్నారు. నార్త్ లాలాగూడ, శేష పహాడ్ చెందిన బాలిక, ఎన్ సి సి పరేడ్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన బాలిక తండ్రి అబ్దుల్ నజీర్ అడ్డగుట్ట డివిజన్ కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తల్లి షబానా బేగం లు, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా తన కూతురు అందుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ఉద్యమంలో పాల్గొనని ఉద్యమకారులకు ఎఫ్ఐఆర్, బైండోవర్ పత్రాలు లభించవు





వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా పట్టణ కేంద్రంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ శీలం స్వామి, మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఒక పత్రిక ప్రకటనలో ఈ విధంగా తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ఉండవలసిన ధృవ పత్రాలలో ఎఫ్ఐఆర్ లుగానీ, బైండోవర్ కేసులు గాని ఉండాలని నియమ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, కొందరు ఉద్యమ నాయకులు ఎఫ్ ఐఆర్ ధృవ పత్రాలు, బైండోవర్ ధృవపత్రాలు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తున్నారని, అవి మోసపూరితమని వారు అన్నారు. వారు చేసే చిల్లర ఎత్తులు సాగవని, స్పష్టంగా ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీలు వేయాలని, కమిటీ వేసి, ఉద్యమకారులను గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ ఉన్నామని, ఇందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే స్పందించి ఉద్యమకారులకు అత్యంత ప్రియమైన నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్ మా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జరిపిన అనేక సర్వ సభ్య సమావేశాలలో వాగ్దానం చేసినారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులను ఇంతకు పూర్వం కూడా, ఎక్కడా, ఎవరినీ డబ్బులు అడగడం లేదని, గతంలో మా రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రకటించి ఉన్నారు. అదే దారిలో యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కూడా కొనసాగుతుందని వారు అన్నారు. వారు స్పష్టం చేసేది ఏమిటంటే, ఎక్కడ ఎవరిని డబ్బులు అడగడం లేదనీ, ఎవరైనా అడిగితే వారిని నిలదీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటివరకు మాకు మేమే, మాకు ఉన్న పరిమిత మైన వనరులతో, ఎవరి డబ్బులు వారు, ఎవరి చార్జీలు వాళ ్ళ భరిస్తూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ఉద్యమకారుల ఫోరంలో జిల్లా, మండలాలలో బయటనే అత్యధిక మంది ఉద్యమకారులు ఉన్నారని, అందుకే ఉద్యమకారులను గుర్తింపు డిమాండ్ రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టి ఉన్నామని, ఉద్యమకారుల ఆశలు ఆకాంక్షలను లైవ్లో ఉంచుతున్నది మాత్రం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మాత్రమేననీ గంటాపథంగా చెప్పుచున్నామని, ఎవరెన్ని దుర్మార్గపు, తప్పుడు ప్రచారాలు చేసినా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముందుకే సాగుతుందని పత్రికాముఖంగా తెలంగాణ ఉద్యమకారులకు తెలియపరుస్తున్నామని వారు అన్నారు.

## సూర్యాపేటలో మరో పరువు హత్య

## -దుండగులను కఠినంగా శిక్షించాలి

## -మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)సూర్యాపేటలో యువకుడిని బండ రాళ్లతో మోది హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ మంగళవారం పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మామిళ్లగడ్డ ఎస్సీ మాల కులానికి చెందిన వడ్లకొండ కృష్ణ (30) అలియాస్ మాల బంటి, సూర్యాపేట మండలం పిల్లలమర్రికి చెందిన భార్గవి ప్రేమించుకున్నారు. ఆమె ప్రేమ విషయం తన తల్లిదండ్రులకు చెప్పగా కులాలు వేరు కావడంతో వారు ఒప్పుకోకపోవడంతో కృష్ణ, భార్గవి గత ఏడాది ఆగస్టులో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కృష్ణ సూర్యాపేటలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ భార్గవితో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి బైరు మహేశ్ అనే మిత్రుడి నుంచి కృష్ణకు ఫోన్ రావడంతో ఇప్పుడే వస్తానంటూ భార్య భార్గవికి చెప్పి బయటకు వెళ్లిన కృష్ణ అదే రాత్రి హత్యకు గురయ్యాడని, కులాంతర వివాహం చేసుకున్నందుకు కక్ష పెంచుకున్న నా సోదరుడు నవీన్ ఈ హత్య చేసినట్లు మృతుని భార్య ఆరోపిస్తున్నందున ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేసి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. గతంలో కూడా సూర్యాపేట కేంద్రంలో కులాంతర వివాహం చేసుకున్నాడని ప్రణయ్ ని దారుణంగా హత్య చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇలాంటి వైఫల్యాలకు కారణం పోలీసు వ్యవస్థ, ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రత్యేకమైన చట్టం తీసుకువచ్చి వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, పోలీసు వ్యవస్థకు ఉండాలన్నారు. ఇలాంటి పరువు హత్యలు పునరావృతం కాకుండా చూడాలని, ఆ దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# వెంకటాపురం గ్రామంలో ఉచితంగా గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరం




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెంకటాపూరం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో "ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేయడం జరిగింది. ఈ శిభిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మరియు వ్యాధి బారిన పడకుండా సకాలంలో టీకాలు వేయించాలని మండల పశువైద్యధికారి డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. ఎదలో ఉన్న వాటికి కృత్రిమ గర్భధారణ చేశారు, చూడి పరీక్షలు చేయడం జరిగింది, దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగింది. రైతులకు కృత్రిమ గర్భధారణ మరియు మేలు జాతి పాడి పశువుల పై అవగాహన కల్పించడం జరిగినది, విటమిన్ ఇంజక్షన్లు ఇవ్వడం, పాల దిగుబడిని పెంచే ఖనిజ లవణ మిశ్రమాలను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ మహేష్, జెవిఓ శ్రీనివాస్, మల్లేశం, ఉపేందర్, గోపాల మిత్రులు బిక్షం, సురేందర్, స్వామి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్ ):- లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన బేగారి పావులవ్వ భర్త అయిన షేక్ అహ్మద్ సాబ్ వయస్సు 47 సం "లు ఎల్లారెడ్డి లో మటన్ కొడుతూ జీవిస్తాడు. షేక్ అహ్మద్ గత 5 సంవత్సరాల నుండి తన మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతో పిచ్చి పిచ్చి గా ప్రవర్తిస్తున్నాడు. తేది 24.01.2025 నాడు ఉదయం 11.00 గంటలకు షేక్ అహ్మద్ బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకి లభించలేదని షేక్ అహ్మద్ భార్య పావులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపినారు.ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఎల్లారెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వవాల్సిందిగా మహేష్ ఎస్ ఐ తెలిపారు.

# పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరణ చేయాలి




బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):-కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఏప్రిల్ 1 2025 నాడు అమలులోకి రాబోతుంది.. ఈ %బజూం% విధానం వల్ల ఉద్యోగులకు భద్రత ఉండకపోగా.. ఇది ముమ్మాటికీ ఉద్యోగులను మోసగించే విధానం అని.. వెంటనే కేంద్ర ప్రభుత్వం గేజిట్ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవాలని పాత పెన్షన్ విధానం ప్రకటించాలని కోరుతూ.. గౌరవ తహసీల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమం లో.. %ూ=ఖ% మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్ గారు, ప్రధాన కార్యదర్శి నాగరాజు గారు ,ఉపాధ్యాయులు రామాంజనేయులు, క్యాకయ్య, శివరాం, చంద్రశేఖర్, రాజు, హరిప్రసాద్, భీమ్రావు పాల్గొనడం జరిగింది.

# వైస్ ప్రెసిడెంట్ గా పైళ్ల సోమిరెడ్డి.....!!



మోత్కూరు మండల రిపోర్టర్( శుభోదయం న్యూస్)ఈ రోజు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రేస్ వైస్ ప్రెసిడెంట్ గా పైళ్ల సోమిరెడ్డి నియమిస్తున్నట్టుగా యాదాద్రి జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి నియామక పత్రం అందజేశారు ....ఈ సందర్భంగా పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరిణిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,%ూజజ% ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు విప్ బీర్ల అవిలయ్య, భువనగిరి చామల కిరణ్ కుమార్ రెడ్డి, యాదాద్రి జిల్లా %ణజజ% అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి గార్లకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

## : “”పసి హృదయాలు పదిలమేనా? “”
## … ఆదర్శ పాఠశాలను ఆనుకొని కోనో కార్పస్ చెట్లు….




సంగెం : (శుభోదయం న్యూస్) : గవిచర్ల ఆదర్శ పాఠశాలను ఆనుకొని ఉన్న పల్లె ప్రకృతి వనంలో హరితహారం లో భాగంగా కోనో కార్పస్ మొక్కలను నాటారు. ఆ మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా మారి ప్రాణాంతక వాయువును వెదజల్లుతున్నాయి. ఈ చెట్ల పెంపకం ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. నిపుణుల హెచ్చరికలతో అనేకచోట్ల ఈ చెట్లను తొలగించడం జరిగింది. మొదట్లో అరబ్బు దేశాలలో ఈ మొక్కలు ఎక్కువగా పెంచేవారు. ఎడారుల్లో ఇసుక తుపానుల భారీ నుండి రక్షిస్తాయని, వాతావరణంలో వేడిని తగ్గిస్తాయని వీటి పెంపకాన్ని ప్రోత్సహించారు. కానీ ఈ చెట్ల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణుల సూచనల మేరకు వీటిని అక్కడ నిషేధించారు. మన రాష్ట్రంలో ఈ మొక్కలు పెంచడానికి కారణం ఈ మొక్కల పెంపకం సులువు అని అందంగా ఉంటాయని త్వరగా పెరుగుతాయని కాబోలు. కానీ ఈ మొక్కలు విడుదల చేసే కార్బన్ డయాక్సైడ్ వీటి పూల నుండి రాలే పుప్పొడి వాతావరణం లో కలిసి ఆ గాలిని పీల్చిన మనుషులకు,( ముఖ్యంగా ఆస్తమా రోగులకు, గతంలో కరోనా బారిన పడిన వారికి, హృద్రోగులకు) సమస్త జీవకోటికి ప్రమాదమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మొక్క వలన ఎలాంటి ఉపయోగాలు లేవు. ఈ చెట్ల ఆకులను పశువులు కూడా తినవు . ఈ చెట్లపై పక్షులు కూడా గూడుకట్టుకోవు. వీటివేర్లు చాలా బలమైనవి భూగర్భ జలాలను ఎక్కువగా తీసుకుంటుందని అంతర్భాగంలో వేసిన మంచినీటి పైపులు, డ్రైనేజీ పైపులలోకి సైతం చొచ్చుకు పోయి నష్టం కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నెక్కొండ నుండి వరంగల్ కు వెళ్ళు ప్రధాన రహదారి పక్కనే దర్శనమిచ్చే గవిచర్ల ఆదర్శ పాఠశాల. పాఠశాల ఆవరణనే ఆనుకొని ఉన్న ఈ విషపూరిత చెట్లు సంబంధిత అధికారులకు గానీ, పాఠశాల యాజమాన్యానికి గాని, ప్రతిరోజు ఈ రహదారి వెంట ప్రయాణం చేసే మేధావులకు గాని కంటబడకపోవడం విడ్డూరం. ఈ పాఠశాలలో (6వ ) తరగతినుండి( 12వ ) తరగతి వరకు దాదాపు ( 700 ) మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు మేల్కొని ఈ విషపూరిత చెట్లను తొలగించి వాటి స్థానంలో సొగసైన పూలను, ఫలాలను, చల్లటి నీడను, ప్రాణవాయువును ఇచ్చే చెట్లను పెంచి విద్యార్థుల ఆరోగ్యాన్ని వారి భవిష్యత్తును కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.




## మంత్రి “కొండా సురేఖ” ఆత్మీయ పరామర్శ..!



వరంగల్,(శుభోదయం):కుటుంబ సభ్యురాలును కోల్పోయి నిరాశ,నిస్పృహలో వున్న కుటుంబానికి నేనున్నాంటూ మంత్రి కొండా సురేఖ అభయమిచ్చారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగశాయిపేట మాజీ కార్పొరేటర్ సారయ్య సతీమణి విమలాదేవి మరణించగా మంగళవారం రోజున మంత్రి కొండా సురేఖ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఏ ఆపద వచ్చిన కొండా దంపతులు ఎల్లవేళలా అండగా ఉంటారని,ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని మంత్రి సురేఖ సూచించారు

## పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి..
## -లబ్ధిదారులకు ముఖ్యమంత్రి
### సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎంపీ డా.కడియం కావ్య



వరంగల్,(శుభోదయం):అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు.హన్మకొండ కనకదుర్గ కాలనిలోని ఎంపీ నివాసంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 5 గురుకి ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 2లక్షల 55వేల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ..రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.వరంగల్ ప్రజల ఎన్నో ఏండ్ల కళను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు.హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరున్న వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.వరంగల్ జిల్లా అభివృద్ధికి 6 వేల కోట్లు కేటాయించారని అన్నారు.వరంగల్ సిటీ మాస్టర్ ప్లాన్,భూగర్భ డ్రైనేజీ,మామునూరు ఎయిర్ పోర్టు,కాజీపేట జంక్షన్రైల్వే కోచ్ ఫ్యాక్టరీ,కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పనులు వెగంగా జరుగుతున్నాయని తెలిపారు.నిరంకుశ పాలన నుండి కాంగ్రెస్ ప్రజా పాలనలోకి అడుగులు పెట్టాం అన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు.రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన పాలన ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని,అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అందజేస్తుందన్నారు.
రానున్న రోజుల్లో వరంగల్ మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో
కాంగ్రెస్ పార్టీ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

## సామాజిక భాధ్యత తో ప్రజా సంఘాలు పనిచేయడం అభినందనీయం మాజీ ఎంపీపీ కందగట్ల కళావతి




సంగెం: (శుభోదయం న్యూస్) : మంగళవారం ఉదయం సంగెం మండల కేంద్రంలోని పద్మశాలి భవన్ లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఆధారిత సంఘాల నాయకులకు లింగాధారిత హింస నివారణ, పరిష్కారా లపై శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా కళావతి పాల్గొని మాట్లాడారు. సామాజిక చైతన్యం లో ముఖ్య పాత్ర వహిస్తూ, గ్రామంలోని సమస్య లను పరిష్కరిస్తూ, అభివృద్ధి కి సహకరిస్తున్నారని,మహిళా సమస్యలను,కుటుంబ సమస్య లను కూడా గుర్తించి నివారించాలని అన్నారు.మహిళలు కుటుంబ అభివృద్ధి లోనే కాకుండా సమాజం లో కూడా గౌరవస్థితి లో ఉన్నారని అన్నారు. అలాగే మహిళల పైన, ఆడపిల్లల పైన జరుగుతున్న దాడులు, హింసలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని, ప్రశ్నించాలని, ప్రతిఘటించాలని అన్నారు. గ్రామాలలో కుటుంబ హింస కు కారణాలను, సహకరించే వ్యవస్థ లను అందరికి తెలియజేయాలని అన్నారు. ఈ సంస్థ సమస్య లలో ఉన్న మహిళలకు వృత్తి నైపుణ్య కార్యక్రమాలు, అవసరం అయిన కుటుంబాలకు కౌన్సిలింగ్, హక్కులు కల్పించడానికి న్యాయ సహాయం, అందిస్తున్నారని అన్నారు.ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఇందిర మాట్లాడుతూ మహిళా సమస్య లపై అందరు మాట్లాడాలని, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మహిళలకు సహకారం అందించి ,రక్షణ కల్పించే వ్యవస్థ ల సమన్వయం తో సమస్యలతో,హింస కు గురైన మహిళ లకు గ్రామస్థాయి మహిళా సహాయత కమిటీలు అండగా నిలబడాలని కోరారు.ఈకార్యక్రమం లో సంగెం మండలం కమ్యూనిటీ లీడర్స్, సంస్థ క్లస్టర్ కో ఆర్డినేటర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి నీ కలిసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల బృందం…..




వరంగల్ జిల్లా,(శుభోదయం): జిల్లా అభివృద్ధిపై సీఎం తో చర్చించిన ఎమ్మెల్యేలు…..ఎమ్మెల్యేల వినతిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాతో పాటు వరంగల్ నగర అభివృద్ధికి స్పష్టమైన హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు……వరంగల్ జిల్లా అభివృద్ధి పై హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని,మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, రాంచంద్రు నాయక్ , మామిడాల యశస్విని రెడ్డి, పీసిసి ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, కలిసి జిల్లా అభివృద్ధి పై చర్చించారు. వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులను వేగవంతం చేసి వీలైనంత తొందరలో హాస్పిటల్ ను ప్రారంభించి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాంపూర్ మడికొండ గ్రామాల మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్ ద్వారా గాలి మరియు త్రాగునీరు కలుషితం అవుతుందని విపరీతమైన పొగ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున తక్షణమే డంపింగ్ యార్డ్ ను అక్కడినుండి తరలించాలని కోరారు. గ్రేటర్ వరంగల్ నగరానికి మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి డి పి ఆర్ తయారుచేసి త్వరితగతిన పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్ కు సంబంధించిన ఎస్టిమేషన్స్ తొందరగా తయారుచేసి పనులు ప్రారంభించాలని కోరారు. వీటన్నింటిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.సంబంధిత అధికారులకు ఫోన్ చేసి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే జనవరి 31 నాడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. అడిగిన వెంటనే వరంగల్ అభివృద్ధిపై సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.కి జిల్లా ఎమ్మెల్యేలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం స్టేషన్ ఘనపూర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా ప్రకటించినందుకు అభినందనలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ మతిస్థిమితంతో మాట్లాడాలి.



మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) ప్రకటించిన పద్మశ్రీ అవార్డుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ కు అవార్డు ప్రకటిస్తే బాగుంటుందని అనగా బండి సంజయ్ పూటకోల మాట్లాడుతు మొన్న ఇందిరమ్మ ఇండ్లల్లో కేంద్రం వాటా తగ్గిస్తా అని నిన్న గద్దర్ కు పద్మశ్రీ ఇవ్వాలని తెలంగాణ ప్రజల కోరికా అని అంటే మత ఉగ్రవాదీలా మాట్లాడుతూ తెలంగాణవాదిలా మాట్లాడడం లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజల గుండెల్లో ఇంకా వందేళ్లు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఉంటారని దేశంలో పెద ప్రజలకు కూడుగుడు అందించిన మహా నాయకురాలు అని వారి గురుంచి మరియు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాలుకు గజ్జెకట్టి ఊరురా తన బానీలతో ప్రజా చైతన్యం ద్వారా రాష్ట్ర ఏర్పాటు లో తన పాత్రాకీలకంగా ఉందని అలాంటి మహానీయుల పేరు కూడా పలికే అర్హత బండి సంజయికి లేదని అన్నారు. రాష్ట్రానికి ఎలాంటి నిధులు తేలేని దద్దమ్మలు ఇలా మాట్లాడడం విడ్డురంగా ఉందని వారికీ బుద్ధి వచ్చేలా ప్రజలు సరియైన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు.

## మేము సైతం మీకోసం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కట్టేబోయిన శివకుమార్ యాదవ్ గౌరవ డాక్టర్ నేషనల్ అవార్డు




కుత్బుల్లాపూర్, శుభోదయం న్యూస్ : కుత్బుల్లాపూర్ డి ఆర్ శివ కుమార్ యాదవ్ 17 సంవత్సరాల వయసులోనే ఒకపక్క చదువుకుంటూ ఒకపక్క క్యాటరింగ్ కి వెళ్తూ అక్కడ మిగిలిన ఆహారాన్ని సేకరించి ఆకలితో ఉన్నవారికి ఆకలి తిరుస్తూ 2019నుంచే సేవ బాటలో నడవటం మొదలు పెట్టాడు. ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాలలో ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీరుస్తూ, నిరుపేద కుటుంబానికి చేయూతను అందిస్తూ, 1700 మందికి పైగా రక్తదానం చేపించి 21 సార్లు రక్తదానం చేశాడు . మేము సైతం మీకోసం ఫౌండేషన్ జిల్లాల వారీగా టీమ్స్ విభజించి యువతను రక్తదానంపై అవగాహన కల్పిస్తూ యువతను సేవా బాటలో నడుపుతున్నారు… అత్యవసర పరిస్థితులు ఎవరికీ రక్తం అవసరం చదువుకునే యువతతోనే గంటల వ్యవధిలోనే రక్త దానం చేపిస్తూ యువతలో మంచి స్ఫూర్తిని నింపుతున్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేస్తున్నందుకు గాను మేము సైతం మీకోసం ఫౌండేషన్ రెండు తెలుగు రాష్ట్రాలలో చేస్తున్న సేవలు గుర్తించి ఫౌండేషన్ చైర్మన్ డి ఆర్ ,కట్టేబోయిన శివ కుమార్ యాదవ్ కి ఈ ఎక్స్ సెంట్రల్ మినిస్టర్, ఎం ఎల్ సి కోటి రెడ్డి, డిప్యూటీ కలెక్టర్, ఎమ్మెల్యే , చేతుల మీదుగా నేషనల్ అవార్డ్ మరియు గౌరవ డాక్టరేట్ గజ మాలతో అందజేయడం జరిగింది.

## రాష్ట్ర మహాసభలకు మోత్కూర్ నుండి హాజరైన ప్రతినిధులు




మోత్కూర్ మండల రిపోర్టర్( శుభోదయం న్యూస్)సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గోకుల్ కన్వర్షన్ లో 25 నుండి 28 వరకు నాలుగు రోజులు జరుగుతున్నాయని, ఆ మహాసభలకు ప్రతినిధులుగా మోత్కూర్ మండలం నుండి బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, రాచకొండ రాములమ్మ, వనం శాంతి కూమార్ గార్లు హాజరైనట్లు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి తెలిపారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాలు ప్రజా సమస్యలపై నిర్వహించిన పోరాటలను సమీక్షించి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు

## రైతుధర్నాకు తరలివెళ్లిన మోత్కూర్ బీఆర్ఎస్ నాయకులు



మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాకు మోత్కూరు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీను, మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండా సోంమల్లు, ముశిపట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నేర్లకంటి మత్స్యగిరి, నాయకులు చౌగోని సత్యంగౌడ్, బయ్యాని పిచ్చయ్య, మర్రి అనిల్ కుమార్, గుంటి దేవా, కంచర్ల క్రాంతికుమార్ రెడ్డి, చేతరాశి వెంకన్న, జంగ నరేష్, కుర్మిళ్ల నరేష్, మొరిగాల శ్రీను, కూరెళ్ల ఇంద్రశేఖర్, అంజయ్య, యాదయ్య, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తుకై చర్చించారు




పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి, శుభోదయం న్యూస్: ఏడుపాయల గోకుల్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం పోలీస్ శాఖ సమావేశం నిర్వహించింది. మాఘ అమావాస్య స్నానాలు సందర్భంగా ఏడుపాయలలో భక్తులకు ఇబ్బందులు రాకుండా మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ ఆదేశాల మేరకు బందోబస్తు పై పోలీస్ శాఖ అధికారులు,సిబ్బందితో చర్చించారు.

# పశు సంపద గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

## – రెంటచింతలలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే






రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : పశు సంపద గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతల లోని సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వారం రోజులు పాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. రైతు జీవితం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, ప్రకృతి, చీడపీడ, మార్కెటింగ్ వంటి అంశాలు ప్రభావితం చేస్తాయన్నారు. రైతులకు వ్యవసాయంలో చేదుడుగా ఉంటున్న పశు సంపద దైవంతో సమానం అన్నారు. రైతులు లాభసాటి పంటలతో పాటు వ్యవసాయానికి మూలాధారమైన పశు సంపదను కాపాడుకోవాలని, రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పశు సంపద పరిరక్షణకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సంస్కృతికి పల్నాడు ప్రసిద్ధి అన్నారు. ఎడ్ల పోటీలు రైతులలో ఉత్సాహం నింపుతాయని సుదీర్ఘకాలం తర్వాత గ్రామంలో తిరునాళ్లకు ఎడ్ల పోటీలు నిర్వహించటం హర్షదాయకమన్నారు. రైతు జీవితంపై చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనను తిలకించిన ఎమ్మెల్యే వారికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు పీటర్ పాపయ్య,వై ఎల్ మర్రెడ్డి, ఎలీషా రాజు, కానుక మాత కోడెగిత్తల ప్రదర్శన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లలో సమన్వయంతో పని చేయండి: ఎమ్మెల్యే జూలకంటి



రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : ప్రాచీన శైవక్షేత్రం సత్రశాలలో నిర్వహించే మహాశివరాత్రి మహోత్సవానికి తరలివచ్చే భక్తజనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లను చేపట్టాలని నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం సత్రశాలలో శివరాత్రి ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సంబంధిత వివిధ శాఖల అధికారులతో కూలంకషంగా చర్చించి సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. వైదిక సిబ్బంది, ఆలయ ధర్మకర్త మండలి పరస్పర సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాలు సంప్రదాయపద్ధంగా జరిపించాలన్నారు. శాఖల వారీగా సమీక్షించి అవసరమైన ప్రతిపాదనలను ఆలయ ఈవోకు నివేదిస్తే ఏర్పాట్లపై దృష్టి సారిస్తామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దేవస్థానం, పోలీస్ శాఖతో మిగతా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కలిగేలా చూడాలని, శీఘ్రదర్శనానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే విధంగా క్షేత్ర పరిధిలో బందోబస్తు, వైద్య సదుపాయం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. అంతకుముందు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద వచనాలతో ఆలయంలోకి శాస్త్రోక్తంగా తోడ్కొని వెళ్లారు. సమావేశంలో ఆర్టీవో మురళీ కృష్ణ, ఎంపీడీవో సరోజినీ దేవి, ఆర్ ఐ పల్లా రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పౌరుషాల వృషభాలు.. వరించిన విజయాలు





రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : కానుకమాత 175 వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు మంగళవారం ప్రారంభించారు. మొదటిగా రెండు పళ్ళ విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీలలో బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన బోయిన నాగరాజుతో పాటు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంకు చెందిన నల్లబోతు ప్రవీణ్ కుమార్ వృషభాలు 3600 అడుగులు లాగి ప్రథమ స్థానంలో విజేతగా నిలిచాయి. రెండో స్థానంలో 3359.3 అడుగులు లాగి పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలకు చెందిన జువ్వాది మేఘనాథ్ నాయుడు ఎడ్ల జత, తృతీయ స్థానంలో 3300 అడుగులు లాగి గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడుకు చెందిన మోపర్తి నవీన్ కుమార్, పల్నాడు జిల్లా ఈపూరు మండలం అంగలూరు కు చెందిన రేగళ్ల హరిబాబు ఎడ్ల జతలు విజేతలుగా నిలిచాయి. నాల్గో స్థానంలో ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడు చెందిన విజయలక్ష్మి నాయుడు,ఐదో స్థానంలో నంద్యాల జిల్లా గడివేములకు చెందిన పెరుమాళ్ల సంజయ్ కుమార్ ఎడ్ల జతలు విజయం సాధించాయి. విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఎడ్ల పోటీలు జరుగుతాయని కానుకమాత కోడెగిత్తల ప్రదర్శన కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సాహంగా జరిగిన ఎడ్ల పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు విశేషంగా తరలివచ్చారు.

# శుభోదయం క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



యాడికి జనవరి 28 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడిలో శుభోదయం పత్రిక 2025 క్యాలెండర్ ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభోదయం పత్రిక దినదిన అభివృద్ధి చెందుతూ నిజాలను నిర్భయంగా రాస్తూ సమస్యల పైన మరియు సమాచారం పైన ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించు కోంటోందని తెలిపారు. ఇంకా మీ పత్రిక మరెన్నో మైలురాయిలను చేరుకోవాలని కోరుకుంటున్నామని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాడపత్రి నియోజకవర్గ కో ఇన్చార్జ్ ఎం.పీ పుల్లయ్య, యాడికి మండల అధ్యక్షులు జీ నరసింహులు, యాడికి మండల ఉపాధ్యక్షులు ఎన్ సూర్యుడు, ఉప్పలపాడు రామకృష్ణ, కుళ్లాయప్ప, శుభోదయం పత్రిక విలేఖరి బండారు బాలకృష్ణ, సూర్య వెలుగు పత్రిక విలేఖరి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, యువతరం పత్రిక విలేఖరి బండారు ధనుంజయ, తదితరులు పాల్గొనడం జరిగింది..

# క్యాలెండర్ ను ఆవిష్కరించిన టిడిపి మండల కన్వీనర్ గోర్తి రుద్రమ నాయుడు



యాడికి జనవరి 28 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) : మండలంలోని పెద్ద పేట గ్రామంలోని తన నివాసంలో శుభోదయం 2025 క్యాలెండర్ ని తెలుగుదేశం మండల కన్వీనర్ గోర్తి రుద్రమ నాయుడు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన శుభోదయం దినపత్రిక అనతి కాలం అందరికి అందుబాటులోకి వచ్చి పాఠకుల మన్ననలను పొందిందని, ఎప్పటికప్పుడు వార్తలను సేకరించి ప్రత్యేక ఎడిషన్లు, క్లిప్పింగ్స్ ఆన్లైన్ ద్వారా పంపుతూ ప్రజలకు,అధికారులకు దగ్గరైదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శుభోదయం పత్రిక విలేకరి బండారు బాలకృష్ణ, సూర్య వెలుగు పత్రిక విలేకరి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# శుభోదయం క్యాలెండర్ ని ఆవిష్కరించిన మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య



యాడికి జనవరి 28 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) : మండలంలోని రాయల చెరువు గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుభోదయం పత్రిక 2025 క్యాలెండర్ ను మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభోదయం పత్రిక ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం వార్తా కథనాలు రాస్తోందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ వాస్తవాలను వెలుగులోకి తెస్తోందన్నారు. సామాన్యులను ఆలోచింప చేసి ప్రజలను చైతన్య పరుస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, శుభోదయం పత్రిక విలేఖరి బండారు బాలకృష్ణ, సూర్య వెలుగు పత్రిక విలేఖరి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, పెద్దవడుగూరు సూర్య వెలుగు విలేఖరి బడిగించల హేమంత్, తదితరులు పాల్గొనడం జరిగింది...

# ఇచ్చిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



యర్రగొండ పాలెం ఇంచార్జి కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్ ): దైవభక్తి ఆధ్యాత్మిక చింతన, పరోపకారం, సేవా తత్పరత తదితర సుగుణాలకు చిరునామా ఆర్యవైశ్యులని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు(ఏపీ) కళావిభూషణ్ డాక్టర్ చీదేళ్ల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపే ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారని చెప్పారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తామని ఎన్నికల ముందు తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి తమ మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.ఐతే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీవో విడుదల చేసిందని వివరించారు. ఈ సంవత్సరం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 31వ తేదీన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా పెనుగొండలోని అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెనుగొండ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందనున్నట్లు చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొని అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు, ఆర్యవైశ్యుల మనోభావాలను ఎప్పటికప్పుడు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తూ ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించడంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి టీజీ వెంకటేష్ లకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు (ఏపీ) కళా విభూషణ్ డాక్టర్ చీదేళ్ళ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు దోర్నాల తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశం



దోర్నాల మండల రిపోర్టర్ –ఆవులయ్య( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండల లో తెలుగుదేశం పార్టీ నాయకులతో మరియు కార్యకర్తలతో, అదేవిధంగా దోర్నాల మండల గవర్నమెంట్ అధికారులతోనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు శివరాత్రి సందర్భంగా రాబోయే భక్తులకి ఎటువంటి ఆటంకాలు ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలి అని ట్రాఫిక్ విషయాలు, ఘాట్ రోడ్డు లలో రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలుగకూడదని.. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు శ్రీ నందమూరి తారక రామారావు గారి విగ్రహా ఆవిష్కరణ కి త్వరలో నాంది పలుకుతాం అంటూ ప్రజలకి తెలియజేసారు...! ఈ కార్యక్రమం లో దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏరువా మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ %ుచీఖజ% ప్రధాన అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి, దోర్నాల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహేష్ గారు, అలాగే దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# “పొలం పిలుస్తుంది కార్యక్రమం”







దోర్నాల మండల రిపోర్టర్– ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా, దోర్నాల మండలం, నల్లగుంట్ల గ్రామం, మరియు కొర్రపోలు గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామాల్లో సాగుచేసిన మినుము మరియు జొన్న పంటలను సందర్శించడం జరిగింది అలాగే ఈ కార్యక్రమంలో రబీ కాలంలో సాగుచేసిన పంటలను ఈ పంట నమోదు చేసుకొని, %వనిఎష% తప్పనిసరిగా చేపించుకోవాలని, అలాగే ప్రెజర్ రైతు కు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ద్వారా గుర్తింపు కార్డును వ్యవసాయ సహాయకుల ద్వారా పొలం ఉన్న ప్రతి రైతుకు గుర్తింపు కార్డులను ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన పిదపగ్రామంలోని రైతులకు మంజూరు చేయడం జరుగుతుంది. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న %జూఎనిఅయిఖఅ%, మరియు అన్నదాత సుఖీభవ , ఇన్ పూట సబ్సిడీ, పంటల భీమా పథకం ఈ పంట నమోదు పథకాలు వర్తిస్తాయని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల వి హెచ్ ఎ మల్లు నాయక్, దోర్నాల మండల నల్లగొండ గ్రామ రైతులు కొర్రపోలు రైతులు అందరూ పాల్గొన్నారు.

# జడ నారయ్య మృతదేహానికి నివాళులర్పించిన దద్దాల



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి మండలం ఏరువారిపల్లి గ్రామ పంచాయతీలోని గంగపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వైయస్ఆర్ సీపీ ఎస్సి నాయకుడు జడ నారయ్య(బుడ్డరామయ్యగుండెపోటుతో మరణించాడు.. ఈ విషయం తెలుసుకున్న కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఈరోజు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.20000/- ఆర్థిక సహాయం చేశారు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు... ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి,ఆవులు భాస్కర్ రెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పల్నాటి భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి,సర్పంచ్ దమ్ము వెంకటయ్య,ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,మాజీ సర్పంచ్ గొబ్బిళ్ళ శీను,వార్డు మెంబెర్ ఆటో జగన్, మేడం కృష్ణారెడ్డి, పగడాల తిరిపాలు, ముప్పూరి తిరుపతయ్య, బిజ్జం శ్రీనివాసరెడ్డి, కురుకుంట్ల మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సతినిపల్లి రోశయ్య పార్థివ దేహానికి నివాళులర్పించిన ఇంచార్జి దద్దాల



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి మండలం అజీస్ పురం గ్రామానికి చెందిన సతినిపల్లి రోశయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిజేసి మనో ధైర్యంగా ఉండాలన్నారు..ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి,మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, సర్పంచ్ దమ్ము వెంకటయ్య,ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం,సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పల్నాటి భాస్కర్ రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,ఆవులు భాస్కర్ రెడ్డి,మాజీ సర్పంచ్ గొబ్బిళ్ళ శీను, ఆటో జగన్ తదితరులు పాల్గొన్నారు.

# శివాని ఆర్ట్స్ అవార్డు అందుకున్న స్వచ్ఛంద సామాజిక సేవకుడు కోక బిక్షం




మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఈసీ మెంబర్, బిఆర్ఎస్ జిల్లా నాయకుడు డాక్టర్ కోక బిక్షం శివాని ఆర్ట్స్, వ్యాస కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో కోక బిక్షం అవార్డు అందుకున్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాకారులకు, వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన వ్యక్తులకు శివాని ఆర్ట్స్ సంస్థ నిర్వాహకులు అవార్డులు ప్రధానం చేశారని తెలిపారు. తాను చేస్తున్న పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు అవార్డు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపి రామదాసు, నంది అవార్డు గ్రహీత కబీర్ పాల్గొన్నారు అని తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డు అందించిన శివాని ఆర్ట్స్ గౌరవ అధ్యక్షులు దొంతి శిల్పారెడ్డికి, వ్యవస్థాపకులు బాపనపల్లి పరమేశ్వర్ కు, వ్యాస కళాక్షేత్రం ఫౌండర్ పెర్మల వేదవ్యాస్ వెంకటేష్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఏఐ చిప్‌లపై అమెరికా ఆంక్షల ప్రభావం




అమెరికా ఇటీవల ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆంక్షలు విధిస్తామని ప్రకటించింది. భారత్ అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చిప్స్ ఎగుమతికి సంబంధించి అమెరికా ఆంక్షలను నిశితంగా పరిశీలిస్తోంది. ఈ నెల ప్రారంభంలో దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించబోతున్నట్లు ప్రకటించింది. ఈ నిబంధనలు చైనా, రష్యా వంటి దేశాల్లో సాంకేతిక పురోగతిని నిరోధించడమే లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఇతర దేశాలపైనా వీటి ప్రభావంపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో ఏఐ చిప్ ఎగుమతుల పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది.

అమెరికా ఆంక్షల పరిధి

అమెరికా ఎగుమతులపై విధించిన ఆంక్షలకు సంబంధించి వివిధ దేశాలను భద్రత, మానవ హక్కుల ప్రమాణాల ఆధారంగా మూడు అంచెలుగా వర్గీకరించింది. టైర్ 1లో యూకే, జపాన్, ఆస్ట్రేలియా వంటి మిత్ర దేశాలు ఉన్నాయి. ఇవి ఎటువంటి ఆంక్షలను ఎదుర్కోవు. భారతదేశం, సింగపూర్, ఇజ్రాయెల్ టైర్ 2 దిగుమతులపై కొన్ని పరిమితులను ఎదుర్కొంటాయి. ఇందులో భాగంగా అధునాతన ఏఐ చిప్‌లకు లైసెన్సింగ్ అవసరం. టైర్ 3లో చైనా, రష్యా వంటి దేశాలు ఉన్నాయి. ఈ దేశాలు తయారు చేసిన చిప్‌లను కొనుగోలు చేయకుండా పూర్తిగా నిషేధించాయి.

భారత్ ఏఐ మౌలిక సదుపాయాలపై ప్రభావం

సమీప భవిష్యత్తులో 10,000 జీపీయూ లతో ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రతిష్టాత్మక జాతీయ ఏఐ మిషన్ ఈ ఆంక్షల కారణంగా అడ్డంకులను ఎదుర్కొనుంది. 2027 వరకు 50,000 జీపీయూలను సిద్ధం చేయాలనే భారత ప్రణాళికలు ఈ ఆంక్షల వల్ల ప్రభావితం చెందే అవకాశం ఉంది. అయితే భారత్ యూఎస్ ఆంక్షల పరంగా టైర్2 విభాగంలో ఉండడంతో ఏఐ చిప్‌ల లైసెన్సింగ్ సదుపాయాలు మరింత మెరుగుపడాల్సి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆంక్షల వల్ల కంపెనీల నిర్వహణ ఖర్చులు పెరిగే ప్రమాదం ఉందని ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్‌ఏ) ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లకు కీలకమైన జీపీయూలకు మార్కెట్ తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం తగిన మార్గాలను అన్వేషించాలని కోరింది.

# మనతో రోబో రన్!

## ప్రపంచంలోనే తొలిసారిగా మనుషులతో కలిసి రోబోల పరుగు

## 12 వేల మంది అథ్లెట్లతో హాఫ్ మారథాన్‌లో పాల్గొననున్న డజన్లకొద్దీ రోబోలు



చైనా రాజధాని బీజింగ్‌లో ఏప్రిల్‌లో జరగనున్న వినూత్న పోటీ

ఎన్నో రంగాల్లో మనిషికి సవాల్ విసురుతున్న మరమనుషులను చైనా.. ప్రపంచంలోనే తొలిసారిగా చరిత్రాత్మక పోటీకి రంగంలోకి దింపుతోంది. అథ్లెట్లు, హ్యూమనాయిడ్ రోబోలకు కలిపి మొట్టమొదటిసారిగా హాఫ్ మారథాన్ (21 కి.మీ.) పరుగు పందెం నిర్వహించనుంది. ఏప్రిల్‌లో జరగనున్న ఈ పోటీకి చైనా రాజధాని బీజింగ్‌లోని డాక్సింగ్ జిల్లా వేదిక కానుంది. ఇందులో డజన్లకొద్దీ హ్యూమనాయిడ్ రోబోలు సుమారు 12 వేల మంది అథ్లెట్లతో పోటీపడనున్నాయి. ఈ రేసులో టాప్–3లో నిలిచే రేసర్లకు (అథ్లెట్లు అయినా లేక హ్యూమనాయిడ్ రోబోలైనా) బహుమతులిస్తారని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్'తెలిపింది. బీజింగ్ ఆర్థిక–సాంకేతికత అభివృద్ధి ప్రాంతం లేదా ఈ–టౌన్ పరిపాలనా సంఘం ఈ వినూత్న పోటీని నిర్వహించనుంది. 20కన్నా ఎక్కువ రోబో తయారీ సంస్థలు హాఫ్ మారథాన్‌లో పాల్గొననున్నాయి.

### స్పెషల్ ఎట్రాక్షన్‌గా 'టియాంగోంగ్'

మారథాన్‌లో పాల్గొనే రోబోలలో చైనాకు చెందిన ఎంబాడీడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్ ఇన్నోవేషన్ సెంటర్ అభివృద్ధి చేసిన టియాంగోంగ్ హ్యూమనాయిడ్ రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ రోబోకు గంటకు సగటున 10 కి.మీ. వేగంతో పరిగెత్తే సామర్థ్యం ఉందని 'ద డైలీ సీపీఈసీ'పేర్కొంది. గతేడాది బీజింగ్‌లో జరిగిన హాఫ్ మారథాన్‌లో రేసు మొదలైనప్పటి నుంచి చివరిదాకా ఈ రోబో మనుషులతో కలిసి పరుగెత్తింది.

### చైనాలో రోబోల అభివృద్ధి ఎందుకంటే..

చైనాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోవడంతో శ్రామికశక్తి తగ్గుముఖం పట్టింది. దీంతో దేశం జనాభాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సమయంలో ఇతర దేశాలతో పోటీపడాలన్నా.. ఆర్థికవృద్ధిని పెంచాలన్నా శ్రామికశక్తి అవసరం. దీనిని భర్తీ చేయడానికి చైనా హ్యూమనాయిడ్ రోబోలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. చైనా ఆగస్టులో హ్యూమనాయిడ్ రోబోలతో ఫుట్‌బాల్, ట్రాక్ అండ్ ఫీల్డ్ లాంటి పోటీలు నిర్వహించనుంది.

### కండిషన్స్ అప్లై..

హాఫ్ మారథాన్‌లో పాల్గొనే రోబోలవిషయంలో చైనా కొన్ని షరతులు విధించింది. అవేమిటంటే.. రోబోలన్నీ మనిషి ఆకృతిలో కనిపించాలి. వాకింగ్ లేదా రన్నింగ్ లాంటి కదలికల లక్షణాలు కలిగి ఉండాలి. అంటే వాటికి చక్రాలు ఉండరాదన్నమాట. రోబోల కనీస ఎత్తు 1.6 అడుగుల నుంచి గరిష్టంగా 6 అడుగుల మధ్య ఉండాలి. హిప్–టు–ఫుట్ పొడవు అంటే నడుము నుంచి పాదం వరకు 1.47 అడుగుల ఎత్తు ఉండాలి. రిమోట్ ద్వారా నియంత్రించే రోబోలు లేదా పూర్తిస్థాయిలో ఆటోమేటిక్ హ్యూమనాయిడ్‌లను పోటీలోకి దింపాలి. అయితే అవసరమైతే పోటీ మధ్య బ్యాటరీలను మార్చుకోవచ్చు. 2,76,288 ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రోబోటిక్స్ ప్రకారం 2023లో చైనా సంస్థలు ఇన్‌స్టాల్ చేసిన రోబోల సంఖ్య. ఇది ఆ ఏడాది ప్రపంచంలోని మొత్తం రోబోల్లో 51 శాతం

# సడన్ ఫేమ్.. చైనా ఏఐ 'డీప్‌సీక్'పై సైబర్ ఎటాక్

జనరేటివ్ ఏఐ సేవలందిస్తున్న చైనీస్ టెక్ స్టార్టప్ డీప్‌సీక్ పై సైబర్‌దాడి జరిగినట్లు ప్రకటించింది. ఈ దాడి కారణంగా కొత్త వినియోగదారుల రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా పరిమితం చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. దాంతో సైట్‌లో నమోదు చేసుకునే వినియోగదారుల సంఖ్యపై ప్రభావం పడింది. సైబర్‌దాడి పరిమిత విభాగానికి చెందిందని, రిజిస్టర్డ్ వినియోగదారులు సాధారణంగా లాగిన్ చేయవచ్చని స్పష్టం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ సేవలందించే డీప్‌సీక్ ఇటీవల తరుచూ వార్తల్లో నిలుస్తోంది. ఓపెన్ ఏఐకు సవాలు విసురుతూ జనరేటివ్ ఏఐ రంగంలో విప్లవాత్మక మార్పునకు పునాది వేసింది. చాటీజీపీటీ పెయిడ్ వర్షన్ అందించే సేవలకు ధీటుగా డీప్‌సీక్‌కు చెందిన ఆర్–1 ఉచితంగానే సర్వీసు అందిస్తున్నట్లు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది. దాంతో అమెరికన్ టెక్ కంపెనీ స్టాక?లు ఇటీవల గణనీయంగా పడిపోయాయి. కంపెనీపై జరిగిన సైబర్ దాడి వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తుంది.

### కంపెనీ స్పందన..

డీప్‌సీక్‌కు పెరుగుతున్న ప్రజాదరణతో సైబర్ మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు కంపెనీ స్టేటస్ పేజీ ద్వారా తెలిసింది. సమస్యలను పరిష్కరించడానికి, నిరంతర సేవను అందించేందుకు కృషి చేస్తున్నామని డీప్‌సీక్ వినియోగదారులకు హామీ ఇచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ రంగంలో అమెరికా, చైనాల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంపై ఈ సైబర్ దాడి చర్చలకు దారితీసింది. డీప్‌సీక్ వేగవంతమైన పురోగతి, తక్కువ ఖర్చు కారణంగా హడావుడిగా సేవలు ప్రారంభించి, సరైన భద్రత ప్రమాణాలు పాటించడంలేదని కొంతమంది యూఎస్ టెక్ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### డీప్‌సీక్ ఆర్–1

భవిష్యత్తులో చైనా ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ అభివృద్ధి చేసిన ఆర్–1 అమెరికా టెక్ కంపెనీలు అభివృద్ధి చేస్తున్న చాట్‌జీపీటీ, ఓపెన్ ఏఐ తదితరాలకు తీవ్ర పోటీతో చెక్ పెట్టనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఏఐలో చైనా వేగాన్ని నిలువరించేందుకు వీలుగా ఇప్పటికే అమెరికా ఆధునిక సెమీ కండక్టర్ టెక్నాలజీలను ఎగుమతి చేయకుండా నిషేధించింది. ఎన్‌విడియా రూపొందిస్తున్న ఏఐ చిప్స్ తదితరాలపై ఆంక్షలు విధించింది. డీప్‌సీక్ అభివృద్ధి చేసిన తాజా ఏఐ మోడల్‌ను గత వారమే మార్కెట్లో విడుదల చేసింది. ఇది ఓపెన్‌ఏఐ, మెటా ప్లాట్‌ఫామ్స్‌కు దీటైన పోటీని ఇవ్వనున్నట్లు టెక్నాలజీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా అమెరికా టెక్ దిగ్గజాలు వందల కోట్ల డాలర్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్న ఏఐ సేవలకు దీటుగా చైనీస్ ఏఐ చౌకగా సేవలు అందించే వీలుందని విశ్లేషకులు అంటున్నారు. ఇది తీవ్ర పోటీకి తెరతీయడంతో యూఎస్ టెక్ దిగ్గజాల పెట్టుబడులపై ఆశించిన స్థాయిలో రిటర్నులకు తెరపడవచ్చని ఆందోళన నెలకొంది. ఫలితంగా ఉన్నట్టుండి టెక్ కౌంటర్లలో అమ్మకాలు నమోదవుతున్నట్లు నిపుణులు తెలియజేశారు.




### ఆందోళనలు.. 'డీప్'

గత వారమే విడుదలైన డీప్‌సీక్ తాజా ఏఐ మోడల్.. అమెరికా ఐఫోన్ల టెక్ దిగ్గజం యాపిల్ ఇంక్ యాప్ స్టోర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరినట్లు తెలుస్తోంది. దీంతో క్వాంట్ ఫండ్ చీఫ్ లియాంగ్ వెన్‌ఫెంగ్ ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ సోర్స్ ప్రొడక్ట్.. ఓపెన్ ఏఐ, మెటా ప్లాట్‌ఫామ్స్ కు పోటీగా నిలుస్తుందన్న అంచనాలు పెరిగాయి. వెరసి అడ్వాన్స్‌డ్ చిప్స్, అత్యున్నత కంప్యూటింగ్ పవర్‌లపై ఆధారపడిన ప్రస్తుత యూఎస్ ఏఐ బిజినెస్ మోడల్‌ను ఆర్–1 దెబ్బతీయవచ్చన్న ఆందోళనలు వ్యాప్తిస్తున్నాయి. ఏఐ విస్తృతిలో ప్రధానంగా ఎన్‌విడియాకు భారీ అవకాశాలు లభించాయి. అయితే ఆర్1 సెగ ఎన్‌విడియాకు అధికంగా తగులుతుందనేది నిపుణులు మాట.

# త్వరలో ప్రభుత్వ యాప్ స్టోర్..

## టెక్ కంపెనీలతో ఎంఈఐటీవై చర్చలు



భారత ప్రభుత్వం తన పౌరులకు సైబర్ భద్రతను పెంచే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ అధికారిక మొబైల్ యాప్‌లను ఒకే వేదికపై ఏకీకృతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) ప్రభుత్వ మద్దతుతో GOV.in అనే యాప్ స్టోర్‌ను రూపొందించాలని ప్రతిపాదించింది. ఇది ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని యాప్‌లకు నెలవు కానుంది. ప్రభుత్వం భావిస్తున్న ప్రతిపాదనలను సులభతరం చేయడానికి గూగుల్, ఆపిల్ సహా ప్రధాన టెక్ కంపెనీలతో పాటు స్మార్ట్‌ఫోన్ తయారీదారులను ఎంఈఐటీవై సంప్రదించింది. ఈ యాప్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా ప్రజా సేవలను మరింత అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపింది. GOV.in యాప్‌స్టోర్‌ను గూగుల్ ప్లే, యాప్ స్టోర్(యాపిల్) వంటి ప్లాట్‌ఫామ్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఫోన్ తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల తయారీ క్రమంలోనే, వినియోగదారులకు చేరకముందే స్మార్ట్‌ఫోన్లలో ఈ ప్రభుత్వ యాప్ స్టోర్‌ను ప్రీ–ఇన్‌స్టాల్ చేయాలని తెలిపింది.

### ప్రయోజనాలు ఇలా..

ఒకవేళ ప్రభుత్వం అనుకున్న విధంగా ఈ సదుపాయాన్ని తీసుకొస్తే GOV.in యాప్ స్టోర్ దేశంలో డిజిటల్ సేవలను మరింత విస్తరించగలదని నిపుణులు భావిస్తున్నారు. పరిమిత స్థాయిలో ఉండే ప్రభుత్వ ఆమోదిత యాప్‌లకు మెరుగైన సైబర్ భద్రత అందించవచ్చని నమ్ముతున్నారు. ప్రపంచ టాప్ కంపెనీ యాపిల్ ఇప్పటికే 2021లో రష్యా నిబంధనలకు కట్టుబడి ఉంది. ఇక్కడ ప్రభుత్వం ఆమోదించిన యాప్‌స్టోర?ను ఇన్‌స్టాల్ చేయడానికి యాపిల్ అనుమతించింది.

### సవాళ్లు ఇవే..

ఈ ప్రతిపాదనకు టెక్ సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. తమ ఆపరేటింగ్ సిస్టమ్‌తో భారత స్మార్ట్ ఫోన్ మార్కెట్లో ఆధిపత్యం చెలాయిస్తున్న గూగుల్, యాపిల్ ప్లాట్‌ఫామ్‌ల్లోని యాప్‌లపై కఠినమైన నియంత్రణను కలిగి ఉంటాయి. డెవలపర్లు తమ స్టోర్ల ద్వారా ఆర్జించే ఆదాయంపై 30% కమీషన్ వసూలు చేస్తాయి. ప్రభుత్వ మద్దతు ఉన్న యాప్ స్టోర్ వారి నియంత్రణను, ఆదాయాన్ని తగ్గిస్తుంది. అయితే దీనిపై ఇంకా కంపెనీలు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

# ఉద్యోగులకు ఏఐ చేదోడు

## ఏఐ వాడుతున్నవారు పదిలో ఏడుగురు

## రాండ్‌స్టడ్ నివేదిక



కృత్రిమ మేధ అంతటా వ్యాపిస్తోంది. పని ప్రదేశాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. కార్పొరేట్ కార్యాలయాలతోపాటు దాదాపు ప్రతి విభాగంలోని ఆఫీసుల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దీని సేవలు వినియోగిస్తున్నారు. ఇటీవల రాండ్‌స్టడ్ వెల్లడించిన నివేదిక ప్రకారం 2024లో 10 మంది భారతీయ ఉద్యోగుల్లో ఏడుగురు కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగిస్తున్నారు. ఉత్పాదకతను పెంచడానికి, వ్యాపార ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి ఏఐపై ఆధారపడడం అధికమవుతుందని ఈ నివేదిక హైలైట్ చేస్తుంది. ఐటీ సేవలు, ఆర్థిక సేవలు, విద్య, తయారీ సహా వివిధ రంగాలకు చెందిన దాదాపు 1,000 మంది ఉద్యోగులతో రాండ్‌స్టడ్ ఏఐ అండ్ ఈక్విటీ రిపోర్ట్ 2024 నివేదిక రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న 56% మంది తాము ప్రతిరోజూ కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఏఐ సాధనాలు వ్యాపార ప్రక్రియలను వేగవంతం చేయడానికి, వాటిని సులభతరం చేయడానికి గణనీయంగా తోడ్పడుతున్నట్లు రాండ్‌స్టడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ పీఎస్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఉద్యోగ పునరుద్ధరణ, డేటా భద్రతపై ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలను కూడా ఈ నివేదిక ఎత్తిచూపింది. మిలీనియల్స్(1995 తర్వాత పుట్టినవారు), బూమర్లు(1970లో జన్మించినవారు) ఏఐ నైపుణ్యాలపై అత్యంత విశ్వాసంతో ఉన్నట్లు నివేదిక తెలిపింది. 37 శాతం మంది తమ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా భద్రత, గోప్యత కారణంగా పనిలో చాట్ జీపీటీ వంటి ఏఐ టెక్నాలజీలను ఉపయోగించడాన్ని నిషేధించే విధానాలను తమ యాజమాన్యం అవలంబిస్తున్నట్లు ప్రతి ముగ్గురిలో ఒకరు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉన్నప్పటికీ చాలా మంది ఉద్యోగులు తమ కెరీర్‌ను మెరుగుపరుచుకోవడానికి మరింత శిక్షణ అవసరమని చెబుతున్నారు. కృత్రిమ మేధ, టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న క్రమంలో అందుకు తగ్గట్టు శ్రామిక శక్తి కూడా పెరిగేలా విధానాలు రావాలని నివేదిక ద్వారా తెలుస్తుంది. భవిష్యత్తులో కొత్తగా ఏ టెక్నాలజీ వస్తున్నా అది శ్రామిక శక్తిని తగ్గించేలా కాకుండా, ఉత్పాదకతను పెంచుతూ మరిన్ని ఉద్యోగాలు సృష్టించేలా ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చాట్‌జీపీటీకి 'గ్రోక్' స్ట్రోక్!

## ఏఐ రంగంలో ప్రముఖ టెక్ కంపెనీల మధ్య పోటీ

## చాట్‌జీపీటీకి పోటీగా 'గ్రోక్'ను తెరపైకి తెచ్చిన ఎలన్ మస్క్

## విస్తృత, వైవిధ్యమైన సేవలతో అగ్రగామిగా చాట్‌జీపీటీ

## 2021కి ముందునాటి సమాచారం ఆధారంగానే దాని సేవలు

## 'రియల్ టైమ్'సమాచార సేవలతో గట్టి పోటీనిస్తున్న గ్రోక్

## హాస్యంతోపాటు ఘాటైన ప్రశ్నలకూ సమాధానమిచ్చేలా దీనికి తర్ఫీదు

## రాజకీయంగా చాట్‌జీపీటీ ధోరణి తటస్థం.. గ్రోక్ మాత్రం విభిన్నం

కృత్రిమ మేధ రంగం కొత్తపుంతలు తొక్కుతూ శరవేగంగా పురోగతి సాధిస్తున్న సమయంలో.. రెండు ప్రముఖ టెక్ కంపెనీల మధ్య పోటీకి దారితీసింది. కృత్రిమ మేధ ఫలాలను సామాన్యులకు సైతం పరిచయం చేసి, టెక్ రంగంలో సంచలనం సృష్టించిన 'చాట్‌జీపీటీ 'కి పోటీగా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్ 'అధినేత ఎలన్ మస్క్‌కు చెందిన 'గ్రోక్ 'తెరపైకి దూసుకొస్తోంది. ఎలన్ మస్క్ తన 'ఎక్స్‌ఏఐ'సంస్థ ద్వారా గత ఏడాది నవంబర్ 3న 'గ్రోక్'ను మార్కెట్లోకి తెచ్చారు. చాట్‌జీపీటీ, గ్రోక్ రెండూ ఏఐ టూల్స్ అయినా రెండింటి మధ్య ఎన్నో వైవిధ్యాలు ఉన్నాయి. తమకు 'గ్రోక్'బాగా నచ్చిందని, 'చాట్‌జీపీటీ'సబ్‌స్క్రిప్షన్‌ను వదిలేసుకుని ఇకపై గ్రోక్‌నే వినియోగిస్తామని 'ఎక్స్'లో కొందరు పోస్టులు పెడుతుండగా.. ఎలన్ మస్క్ వాటిని షేర్ చేస్తూ ప్రమోట్ చేసుకుంటున్నారు. నిజానికి కృత్రిమ మేధ రంగంలో అగ్రగామిగా ఉన్న 'చాట్‌జీపీటీ'కి గ్రోక్ పోటీ ఇవ్వగలదా అన్నది భవిష్యత్తులో తేలిపోనుంది.

ప్రస్తుతానికి చాట్‌జీపీటీదే ఆధిపత్యం..

'గ్రోక్'తాజా వెర్షన్‌కు ఆధారం ఎక్స్‌ఏఐకి చెందిన గ్రోక్%–%2 మోడల్. ఉచితంగా ఏఐ ఆధారిత సేవలు అందిస్తున్న ఇతర టూల్స్‌తో పోల్చితే పనితీరు, సామర్థ్యంలో ఇది ముందంజలో ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు. కొన్ని అంశాల్లో 'చాట్‌జీపీటీ'ఉచిత వెర్షన్ (%టూ% 3.5)ను సైతం గ్రోక్ అధిగమించినట్టు పలు పరీక్షల్లో తేలిందని అంటున్నారు. అయితే 'చాట్‌జీపీటీ ప్లస్'వెర్షన్‌లో ఉపయోగించే 'జీపీటీ–4'మోడల్ సామర్థ్యంతో పోల్చితే 'గ్రోక్'వెనకబడే ఉందని స్పష్టం చేస్తున్నారు. మార్కెట్లో ఎక్కువ కాలం నుంచి కొనసాగుతుండటంతో పాటు గణనీయ స్థాయిలో డేటాతో శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో చాట్‌జీపీటీ ప్రత్యేకంగా నిలుస్తోందని.. వినియోగదారులకు అవసరమైన సేవల నుంచి సృజనాత్మక రచనల వరకు విస్తృత శ్రేణిలో సృజన చూపగలుగుతోందని పేర్కొంటున్నారు.




హాస్యాన్ని మేళవించి.. సమాచారం అందించే గ్రోక్..

గ్రోక్ హాస్యాన్ని మేళవించి సరదా సంభాషణలతో, కొంతవరకు తిరుగుబాటు వైఖరిని కూడా మేళవించి సమాధానాలు ఇస్తుందని దీని రూపకర్తలు చెబుతున్నారు. ఇతర ఏఐ టూల్స్ చెప్పలేకపోయే ఘాటైన ప్రశ్నలకు సైతం సమాధానమిచ్చేలా దీనిని రూపొందించామని అంటున్నారు. రాజకీయ అంశాల విషయంలో గ్రోక్ ధోరణి అందరికి నచ్చకపోవచ్చని.. అందుకే రాజకీయంగా పూర్తిగా సరైనది కాదని పేర్కొంటున్నారు. మరోవైపు చాట్‌జీపీటీ తటస్థంగా, మర్యాదపూర్వకంగా, సమగ్రమైన ధోరణిలో స్పందిస్తుంది.

రియల్ టైమ్‌లో గ్రోక్ పైచేయి

గ్రోక్ సామాజిక మాధ్యమం ఎక్స్ నుంచి రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి వర్తమాన అంశాలు, సరళులపై తాజా సమాచారాన్ని అందించగలుగుతుంది. అవసరమైతే ఇంటర్నెట్‌లోనూ రియల్ టైమ్ సమాచారాన్ని సేకరించి విశ్లేషిస్తుంది. ఈ అంశంలో గ్రోక్ ముందంజలో ఉంది. చాట్‌జీపీటీ అత్యంత శక్తివంతమైనదే అయినా 'గ్రోక్'తరహాలో రియల్ టైమ్ అప్‌డేషన్ లేదు. కటాఫ్ తేదీ (2021)కి ముందు నాటి సమాచార పరిజ్ఞానాన్ని మాత్రమే చాట్‌జీపీటీ వినియోగించి సేవలు అందిస్తుంది. అయితే డబ్బులు చెల్లించి సబ్‌స్క్రయిబ్ చేసుకునే ప్రీమియం వెర్షన్ (చాట్‌జీపీటీ ప్లస్) దీనికి మినహాయింపు.

గ్రోక్ 'ఎక్స్'లోనే.. జీపీటీ అన్నిచోట్లా..

గ్రోక్ ప్రస్తుతం 'ఎక్స్'యాప్‌లోనే సమ్మిళితమై సేవలందిస్తోంది. అంటే 'ఎక్స్'వినియోగదారులకు మాత్రమే అందుబాటులోకి ఉంది. దీనిని తొలుత 'ఎక్స్ (ట్విట్టర్)'ప్రీమియం ప్లస్, ప్రీమియం వినియోగదారులకు మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. అనంతరం కొన్ని పరిమితుల మేరకు ఉచిత వినియోగదారులకు సైతం అందుబాటులోకి తెచ్చారు. భవిష్యత్తులో 'ఎక్స్'ప్రీమియం, ప్రీమియం ప్లస్ చందాలు కట్టాల్సిన అవసరం లేకుండా.. 'గ్రోక్'కే చందా కట్టి సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చని రూపకర్తలు చెబుతున్నారు. మరోవైపు 'చాట్‌జీపీట–3.5'పాత వెర్షన్ అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంది. వినియోగదారులకు మరింత విస్తృతమైన సేవలందించే అత్యాధునిక 'జీపీటీ–4'వెర్షన్‌కు మాత్రం డబ్బులు చెల్లించి సబ్‌స్క్రయిబ్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటిని వెబ్, మొబైల్ యాప్స్, ఎంఎస్ ఆఫీస్ ద్వారా విస్తృత రీతిలో పొందవచ్చు.

దేనికది ప్రత్యేకం

కంటెంట్ సృష్టి, అనువాదం, కస్టమర్ సపోర్ట్, విద్య, వ్యక్తిగత సహాయం, కోడింగ్, మేధోమథనం వంటి వైవిధ్యభరిత సేవలను విస్తృతరీతిలో చాట్‌జీపీటీ అందిస్తోంది. వినియోగదారులు టెక్స్ట్‌తోపాటు చిత్రాలను ఇన్‌పుట్‌గా వాడే సదుపాయాన్ని చాట్‌జీపీటీ ప్లస్ కల్పిస్తోంది. నిర్దిష్టమైన పరిశ్రమలు, వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు కస్టమైజ్డ్ సేవలను సైతం చాట్‌జీపీటీ అందిస్తోంది. ఇక 'గ్రోక్'విషయానికి వస్తే సామాజిక మాధ్యమాలతో అనుసంధానం, రియల్ టైమ్ సమాచారం, వినోదం, సాధారణ ప్రశ్నలకు సమాధానాలు వంటి సేవలను వినూత్న రీతిలో అందిస్తోంది. 'గ్రోక్'ను అగ్రగామిగా నిలపాలనే వ్యూహంతో ఎలన్ మస్క్ భవిష్యత్తులో మరెన్నో వైవిధ్యభరిత సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెబుతున్నారు కూడా.

'గ్రోక్'పేరు ఎందుకు

'గ్రోక్'అనే ఆంగ్ల పదానికి అర్థం 'ఎవరినైనా/ఏదైన అంశాన్ని లోతుగా అవగతం చేసుకోవడం'. రాబర్ట్ ఎ.హెన్లీన్ తన సైన్స్‌ఫిక్షన్ నవల 'స్ట్రేంజర్ ఇన్ ఏ స్ట్రేంజ్ ల్యాండ్'లో వాడిన 'గ్రోక్'పదం నుంచి స్ఫూర్తి పొందిన ఎలన్‌మస్క్ తన ఏఐ టూల్‌కు ఈ పేరును పెట్టారు.